

విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర



భూం..ధాం..!

● రాష్ట్రాన్ని కుదిపేస్తున్న వక్ఫ్ భూముల వివాదం
● నోటీసులతో రైతుల్లో ఆగ్రహం ● బొమ్మై హయాంలోనే మొదలు: మంత్రి జమీర్
● అవి ఫేక్ వీడియోలు: మాజీ సీఎం బొమ్మై
● నేడు రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ నిరసనలు



బెంగళూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాలను వక్ఫ్‌భూముల వివాదం కుదిపేస్తోంది. తరతరాలుగా సాగు చేసి జీవనం సాగిస్తున్న రైతులకు ఒక్కసారిగా షాక్ ఇచ్చేలా సదరు భూములు వక్ఫ్ బోర్డుకు చెందినవంటూ నోటీసులు జారీ చేయడం గందరగోళానికి కారణమవుతోంది. వందలాదిమంది రైతులకు నోటీసులు అందడం, మరోవైపు వివిధ ప్రాంతాల్లో రేపోమాపో నోటీసులు వస్తాయనే ప్రచారం హల్‌చల్ చేస్తోంది. నోటీసుల ప్రస్తావన లేకుండానే ప్రచారం కారణంగానే హవేరీ జిల్లాలో ఇరువర్గాల మధ్య గొడవలు జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఒక్కసారిగా వక్ఫ్ భూముల వివాదం ఎందుకు తెరపైకి వచ్చిందనేది ప్రశ్నార్థకంగా మారింది.

రాష్ట్రంలో 1.15 లక్షల ఎకరాల భూమి వక్ఫ్‌బోర్డుకు చెందినవిగా ఉన్నట్లు ఒక అంచనా. అయితే అధికారికంగా రికార్డులలో 23వేల ఎకరాలు మాత్రమే ఉంది. ఎక్కువ వక్ఫ్ ఆస్తులకు రికార్డులు లేవు. ఎన్నో గ్రామాలు, పట్టణాలలో వక్ఫ్ ఆస్తులు ఆక్రమణలు జరిగాయని దశాబ్దాల కాలంగా వస్తున్న ఆరోపణలు. వక్ఫ్ అదాలత్ జరిపి వక్ఫ్‌బోర్డు ఆస్తులను సంరక్షించుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మైనారిటీ సంక్షేమం, వక్ఫ్‌శాఖ మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్ ఆ దిశగా వక్ఫ్ ఆస్తులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. దశాబ్దాల కాలంగా విభజనలు, రికార్డులు లేకుండా కాలం 11లో ఖాళీగా ఉండే భూములను వక్ఫ్‌కు చెందినవిగా భావించి వాటిని అనుభవిస్తున్నవారికి నోటీసులు జారీ చేస్తున్నారు.

కేంద్రప్రభుత్వం పార్లమెంటులో వక్ఫ్ చట్టానికి సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. దీనిపై సమగ్ర పరిశీలనకు జాయింట్ పార్లమెంటు కమిటీని రూపొందించింది. ఈ చట్టం అమలులోకి వస్తే రికార్డులలో లేని వక్ఫ్ ఆస్తులను వదులుకోవాల్సి ఉంటుంది. అందుకోసమే అన్ని వక్ఫ్ ఆస్తులకు రికార్డులు రూపొందించుకోవాలని భావించిన మేరకు వక్ఫ్ ఆస్తుల రక్షణ కోసం పహణి (ఈసీ)లో కాలం11ను ఆక్రమణగా పరిగణించాలనే తీర్మానమే వివాదానికి కారణమైంది. భూమి స్వాధీనంలో ఉన్న రైతులు, ప్రజలు సంక్లిష్ట పరిస్థితికి గురిచేసినట్టు అయ్యింది. వక్ఫ్ ఆస్తుల ఆక్రమణలకు సంబంధించి గత ప్రభుత్వ పాలనలోనూ నోటీసులు ఇచ్చారు. ఇది నిరంతరంగా కొనసాగుతున్న ప్రక్రియ అని ప్రభుత్వం సమర్థించుకుంటోంది. 2019 నుంచి 2023వరకు బాగల్కోట జిల్లాలో 127, కలబురగిలో 89, చిక్కమగళూరులో ఏడుగురికి నోటీసులు ఇచ్చారు. కొందరు కోర్టును ఆశ్రయించగా సాగు చేస్తున్నవారికే కోర్టు అనుమతులు ఇచ్చారు. మరికొన్ని కేసుల్లో స్టేలు ఉన్నాయి. కలబురగిలో వివాదానికి సంబంధించి హైకోర్టు ఆదేశాలతో వక్ఫ్ నమోదును తొలగించారు. విజయపుర జిల్లాలో ఇటువంటివి 109 కేసులు గుర్తించారు. అయితే ఇప్పటివరకు ఎవరికీ నోటీసులు ఇవ్వలేదు. తాజాగా నోటీసులు ఇచ్చినవారు ఆందోళనకు దిగడంతో వారికి ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్‌లు మద్దతు పలుకుతున్నాయి. వివాదం మలుపులు తిరిగి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా మారడంతో వక్ఫ్ భూములకు సంబంధించి రైతులకు ఇచ్చిన నోటీసులను రద్దు చేయాలని సీఎం సిద్దరామయ్య ఆదేశించారు. ఇలా కొన్నేళ్లుగా సాగుతున్న అంశం వివాదాలకు కారణమవుతోంది. కాగా వక్ఫ్ భూముల పేరిట రైతులకు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ నిరసనలకు దిగుతోంది.

పాత వీడియోలతో ప్రచారం

● మాజీ సీఎం బొమ్మై ఆగ్రహం

బెంగళూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలనలో వక్ఫ్ భూములంటూ రైతులు ఎవరికీ నోటీసులు జారీ చేయలేదని, అయితే మంత్రి జమీర్ అహ్మద్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై మండిపడ్డారు. బెంగళూరులో ఆదివారం మీడియాతో మాట్లాడిన బొమ్మై హజ్ భవనం ప్రారంభంలో మాట్లాడిన పాత వీడియోను ప్రచారం చేస్తున్నారన్నారు. బీజేపీ పాలనలో ఒక్క రైతుకు కూడా నోటీసులు ఇవ్వలేదన్నారు. అన్వర్ మానప్పాడి వక్ఫ్‌భూములపై ఇచ్చిన నివేదికకు అనుగుణంగా సిట్ లేదా సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. రైతులు ఆస్తులు కాపాడాలంటే ప్రభుత్వం వక్ఫ్ గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమాజంలో తప్పుడు ప్రచారంతో రాజకీయాలు చేయాలనుకోవడం సరికాదన్నారు. అయితే పాతవీడియో ప్రచారంపై సొంత పార్టీ కార్యకర్తల్లోనూ విమర్శలు ఆరంభమయ్యాయి. హజ్‌భవనంలో జరిగిన కార్యక్రమంలో సీఎం హోదాలో బొమ్మై రాష్ట్రంలో 2వేల కోట్ల విలువైన వక్ఫ్ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులు స్వాధీనం చేసుకున్నారని, వాటిని దక్కించుకోవాలని సూచించారు. అదే వీడియోలను కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది.



మంత్రి జమీర్ ఒత్తిడితోనే..

● రైతుల భూములు వక్ఫ్ బోర్డు జాబితాలోకి
● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర

బళ్లారి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి జమీర్ అహ్మద్ రైతుల భూములను వక్ఫ్ బోర్డు రికార్డుల్లో చేర్చాలని జిల్లా కలెక్టర్లపై ఒత్తిడి చేస్తున్నాడని, ఆ మంత్రిని రాష్ట్రం నుంచి బహిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర డిమాండ్ చేశారు. సండూరు ఉప ఎన్నికల నేపథ్యంలో ఆదివారం మాజీ ఎంపీ శ్రీరాములు, గాలి జనార్దన్‌రెడ్డి, ఇతర బీజేపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. మంత్రి జమీర్ అహ్మద్ రాష్ట్రంలో విస్తృతంగా పర్యటిస్తూ రైతుల భూములను వక్ఫ్‌లోకి మారుస్తున్నారన్నారు. ఆయన చెప్పినట్లు వినాల్సిందేనని బెదిరిస్తున్నట్లు కొందరు అధికారులు తమ దృష్టికి తెచ్చారన్నారు. ఇలాంటి మంత్రి రాష్ట్రంలో ప్రజలను, రైతులను ఇబ్బంది పెడుతున్నాడే కానీ ప్రజలకు ఏమాత్ర సహకారం చేయడం లేదని ఆరోపించారు. ఇలాంటి మత పిచ్చి మంత్రి రాష్ట్రంలో ఉండడం అవసరమా..? అని ప్రశ్నించారు.

సీఎం గారూ.. కుర్చీ భద్రం చేసుకోండి..!

బెంగళూరు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ పాలనలో సాగిన అంశాలపై పరిశీలించడం వదిలేసి ముందు మీ కుర్చీని భద్రం చేసుకోవాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర సీఎం సిద్దరామయ్యకు హితవు పలికారు. డీసీఎం డీకే శివకుమార్ శక్తిగ్యారెంటీపై పునరాలోచిస్తామని చేసిన వ్యాఖ్యలు, ఆ తర్వాతి పరిణామాలపై సాగిన విమర్శలపై విజయేంద్ర ఆదివారం స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చర్చలకు రావాల్సిన అవసరం లేదని, బహిరంగచర్చకు తాను సిద్ధమని విజయేంద్ర సవాల్ చేశారు. తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. క్రమశిక్షణలో బీజేపీకి తిరుగులేదని, అదే విధానం కొనసాగిస్తోందన్నారు. ముఖ్యమంత్రి హోదాలో కొనసాగుతున్నారని, మీపై ఆరోపణలకు విచారణకు హాజరయ్యేముందు కనీసబాధ్యత పాటించాలన్నారు. యడియూరప్ప పోరాటాల ద్వారా రాజకీయాల్లోకి వచ్చారన్నారు. 'ముడా' అవినీతి, వాల్మీకి కార్పొరేషన్‌లో అక్రమాలకు సరైన సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు. రైతులు తరతరాలుగా సాగు చేస్తున్న భూములకు ఏ విధంగా వక్ఫ్ అన్వయిస్తుందన్నారు. రాష్ట్రమంతటా అన్నదాతలపై దాడి సమంజసమేనా అన్నారు. 15సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన మీరు ఉద్యోగులకు వేతనాలు ఇచ్చేందుకు అప్పులు చేయడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు. కాగా విజయేంద్ర వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి తీవ్రంగా పరిగణించారు. నాతో చర్చకు వచ్చేముందు మీ పార్టీకి చెందిన యత్నాళ్, రమేశ్ జార్కిహొళిలతో ఓ విడత చర్చించాలన్నారు. తనపై అవినీతి ఆరోపణలు చేసే మీరు కేసులు ఎదుర్కోవడం లేదా..? అన్నారు. మీ తండ్రి యడియూరప్ప ముఖ్యమంత్రి అయ్యేందుకు అధిష్ఠానానికి రూ.2వేల కోట్లు ఇచ్చారని, మీ పార్టీకి చెందిన వారే ఆరోపించారని, వాటికి సమాధానం చెబుతారా.. అని ప్రశ్నించారు. మీరు కమీషన్ ఇవ్వడంలోనే పరిణితులన్నారు. మీ తండ్రి యడియూరప్ప పోక్సో కేసును ఎదుర్కొంటున్న అంశానికి ఏ విధంగా సమాధానం ఇస్తారని ప్రశ్నించారు. బేటీ బచావో బేటీ పడావో అనే ప్రధానమంత్రి, మీ తండ్రి ఎదుర్కొంటున్న పోక్సో కేసుపై ఏమని సమాధానం ఇవ్వగలరన్నారు.

అప్పుల బాధతోనే..

● దర్శకుడు గురుప్రసాద్ ఆత్మహత్యపై పోలీసుల ప్రాథమిక అంచనా

బెంగళూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రముఖ దర్శకుడు, నటుడు గురుప్రసాద్ (52) ఆత్మహత్య శాండల్‌వుడ్‌లో కలకలం రేపింది. మఠ, ఎద్దేళు మంజునాథ సినిమాల ద్వారా ఆయన ప్రముఖ దర్శకుడిగా పేరొందారు. నగరంలోని అపార్ట్‌మెంట్‌లో ఉరి వేసుకున్న స్థితిలో ఆదివారం గుర్తించారు. అయితే అప్పుల వారి వేధింపులతోనే ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. బెంగళూరు ఉత్తర తాలూకా మాదనాయకనహళ్ళిలోని అపార్ట్‌మెంట్‌లో గురుప్రసాద్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలియగానే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. 'రంగనాయక' సినిమా ఫ్లాప్ కావడంతో గురుప్రసాద్ అప్పులపాలైనట్లు తెలుస్తోంది. కాగా గురుప్రసాద్ రెండో వివాహం చేసుకున్నాడు. తెలిసినవారందరితోనూ అప్పులు చేసినట్టు సమాచారం. చివరకు అతడివద్ద సహాయకులుగా పనిచేసేవారినుంచి అప్పులు తీసుకుని తిరిగి ఇవ్వలేదని తెలుస్తోంది. శాండల్‌వుడ్‌లో పేరొందిన దర్శకులలో గురుప్రసాద్ కూడా ఒకరు. మఠ సినిమా ద్వారా శాండల్‌వుడ్‌లోకి ప్రవేశించారు. ఎద్దేళు మంజునాథ కూడా సూపర్‌హిట్ అయ్యింది. తర్వాత డాలి ధనంజయతో కలసి డైరెక్టర్ స్పెషల్ అనే సినిమా తీశారు. అంతగా ప్రాచుర్యం పొందకపోయినా భారీగా నష్టాలు రాలేదు. 2017లో 'ఎరడనే సల్' (రెండోసారి) సినిమా దెబ్బతింది. ఇదే ఈ ఏడాది జగ్గేశ్‌తో కలసి రంగనాయక సినిమా తీశారు. అది కూడా ఫెయిల్ కావడంతో మానసికంగా ఇబ్బంది పడ్డారు. గురుప్రసాద్, ఆరతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆమెకు ఒక బిడ్డ కూడా ఉన్నారు. 16ఏళ్ల సంసార జీవనం తర్వాత ఆరేడేళ్ల క్రితం విభేదాలు రావడంతో విడిపోయారు. సినిమాలలో చిన్నపాత్రలు చేసుకుంటున్న సుమిత్రను రెండో వివాహం చేసుకున్నారు. ఇప్పటికే మూడేళ్ల కుమార్తె ఉండగా ప్రస్తుతం ఆమె గర్భవతి. కొంతకాలంగా రెండో భార్యకు దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది. వారం రోజులుగా అపార్ట్‌మెంట్‌లో ఒక్కరే ఉన్నట్లు తెలుస్తోంది. అప్పులవారి వేధింపులతోపాటు ఓ చెక్‌బౌన్స్ వివాదం కూడా ఉన్నట్లు సమాచారం. రెండువారాల కిందటే పుస్తకాలు కొనుగోలు చేసిన 65వేల రూపాయలు ఇవ్వలేదని దుకాణం యజమాని, గురుప్రసాద్‌పై జయనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిసింది. కాగా ఆత్మహత్యపై మాదనాయకనహళ్ళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. గురుప్రసాద్ మృతి పట్ల నటుడు, రాజ్యసభ సభ్యుడు జగ్గేశ్, డాలి ధనంజయ్ సహా ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.



దర్శకుడు గురుప్రసాద్ (ఫైల్)



అలంకరణలో హాసనాంబ మూలవిరాట్టు

హాసనాంబ ఆలయం మూత

● 11రోజుల్లో రూ.9 కోట్ల ఆదాయం

బెంగళూరు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన హాసన్‌లో వెలసిన హాసనాంబదేవి దర్శనాలకు తెరపడింది. ఆదివారం మధ్యాహ్నం 12.33 గంటలకు ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో గర్భగుడికి తాళం వేశారు. హాసనాంబ ఆలయాన్ని ఏడాదికోసారి మాత్రమే తెరిచే సంప్రదాయం ఉంది. 12రోజులక్రిందట ఆలయాన్ని తెరిచారు. తొలిరోజున భక్తులకు దర్శనం ఉండదు. చివరిరోజున మధ్యాహ్నానికే మూత వేస్తుండడంతో ఉదయంనుంచే దర్శనాలు ఉండవు. ఆదివారం తెల్లవారుజామున పూజలు, నైవేద్యం సమర్పించేందుకు భక్తుల దర్శనాన్ని నిలిపివేస్తారు. తర్వాత నందా దీపాన్ని వెలిగించి గర్భగుడికి తాళం వేసి ఆలయ పాలక మండలికి అప్పగిస్తారు. చివరిరోజున దర్శనం చేసుకునేందుకు వచ్చిన వేలాదిమంది భక్తులు నిరాశ చెందారు. అక్టోబరు 24న హాసనాంబ ఆలయాన్ని తెరిచారు.

ఏటా వివాదమే... పెరుగుతున్న భక్తులు

ఏడాదికోసారి మాత్రమే తెరుచుకునే ఆలయం కావడంతో హాసనాంబ దేవిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున వస్తుంటారు. ఏటా భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గతంలోనూ పలుమార్లు తొక్కిసలాటలు జరిగాయి. కొవిడ్‌వేళ భక్తులకు దర్శనం లేకుండా డిజిటల్ స్క్రీన్‌ల ద్వారా అవకాశం కల్పించారు. ఇటీవల మూడేళ్లుగా సాధారణ దర్శనం కొనసాగుతున్నా భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో కట్టడి చేయడం సాధ్యం కాని పరిస్థితిగా మారుతోంది. ఈ ఏడాది దర్శనాలవేళ జిల్లా అధికారి వ్యక్తిగత కార్యదర్శి పలువురిని ఆలయం వద్దకు తీసుకొచ్చినవేళ వివాదమైంది. తోపులాటలో ఓ మహిళా పోలీస్ గాయపడ్డారు. విషయం తెలుసుకుని జిల్లా అధికారి సత్యభామ నేరుగా ఆలయం వద్దకు వచ్చి పోలీసులపై మండిపడ్డారు. విధి నిర్వహణలో ఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్, జిల్లా అధికారిపై తిరగబడిన విషయం సంచలనమైంది. భక్తులకు రూ.300, రూ.1000 టిక్కెట్‌తోపాటు వీవీఐపీ, సాధారణ దర్శనాలు కల్పించారు. వీవీఐపీ పాస్‌లు వేలసంఖ్యలో ఇవ్వడం భక్తులకు ఆగ్రహం తెప్పించింది. ఇలా గొడవ చోటు చేసుకోవడంతో మూడు రోజులుగా వీవీఐపీ, రూ.300, 500 దర్శనాలను నిలిపివేశారు. ఈ ఏడాది టిక్కెట్‌ల రుసుంతోపాటు లడ్డూ ప్రసాదం ద్వారా ఆలయానికి 11 రోజుల్లో రూ.9కోట్ల ఆదాయం వచ్చినట్లు సమాచారం. రోజూ లక్షన్నర నుంచి రెండులక్షల మంది దాకా భక్తులు వచ్చినట్లు తెలుస్తోంది. హాసనాంబ ఆలయం తలుపులను మూసేవేళ ఎంపీ శ్రేయస్‌పటేల్, ఎమ్మెల్యే స్వరూప్ ప్రకాశ్, శివలింగేగౌడ, జిల్లా అధికారి సత్యభామ, ఎస్పీ మహ్మద్ సుజితాతోపాటు పాలకవర్గం అధికారులు పాల్గొన్నారు.

ప్రచారానికి దూరం పెట్టారు..!

● బీజేపీ క్యాంపెయినర్ల జాబితాలో యత్నాళ్, జార్కిహొళి పేర్లు గల్లంతు

బెంగళూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మూడు శాసనసభ స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికల క్యాంపెయినర్‌ల జాబితాలో బీజేపీ సీనియర్ నేత బసనగౌడ పాటిల్‌యత్నాళ్, మాజీ మంత్రి రమేశ్ జార్కిహొళి పేర్లు గల్లంతయ్యాయి. ఈనెల 13న చన్నపట్టణ, శిగ్గావి, సండూరు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మూడుచోట్ల ప్రచారం కోసం 40మందితో కూడిన జాబితాను విడుదల చేశారు. అందులో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రకు వ్యతిరేకంగా ఉండే టీమ్‌ను దూరం పెట్టారు. వీరిలో కేంద్రమాజీ మంత్రి, ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్, ఎమ్మెల్యే, మాజీ మంత్రి రమేశ్‌జార్కిహొళి, మాజీ మంత్రి అరవింద లింబావళి, మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ, కుమార బంగారప్పలను పరిగణించలేదు. యత్నాళ్ ఓ ఫైర్‌బ్రాండ్ నాయకుడిగా పేరొందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నర కాలంలో సంచలనమైన అంశాలను లేవనెత్తడంతోపాటు ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ కీలకులను విమర్శించడంలో ముందంజలో ఉన్నారు. ఆయన ప్రతిపక్షనేత లేదా పార్టీ అధ్యక్షపదవిని ఆశించారు. రెండూ దక్కకపోవడంతో మిన్నకుండిపోయారు. అయితే పార్టీ అధ్యక్షుడు విజయేంద్రకు వ్యతిరేకంగా ఉన్నారు. ఉత్తర కర్ణాటక పరిధిలో శిగ్గావి, సండూరులలో ఎన్నికలు జరుగుతున్నా అదే ప్రాంతానికి చెందిన పలుకుబడి కల్గిన యత్నాళ్, జార్కిహొళిల పేర్లు లేకుండా చేయడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా జాబితాలో కీలకనేత యడియూరప్ప, పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ అగర్వాల్, కో-ఇన్‌చార్జ్ సుధాకర్ రెడ్డి, విజయేంద్ర, అశోక్, చలవాది నారాయణస్వామి, సదానందగౌడ, బసవరాజ్ బొమ్మై, ప్రహ్లాద్ జోషి, నళిన్‌కుమార్ కటీల్, గోవింద కారజోళ, సీఎన్ అశ్వత్థనారాయణ, సీటీ రవి, శ్రీరాములు, జగదీశ్ శెట్టర్, శోభాకరంద్లాజె, సోమణ్ణ, సునిల్ కుమార్ తదితరులు ఉన్నారు.



రమేశ్ జార్కిహొళి



బసనగౌడ పాటిల్‌యత్నాళ్



స్కూల్ ఎగ్జామినేషన్, అసెస్‌మెంట్ బోర్డు కార్యాలయం

గందరగోళానికి తెర..!

● గుర్తింపులేని విద్యాసంస్థలతో ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులకు ఇబ్బందులు ● ముందే మేల్కొన్న అధికారులు
● విద్యార్థులకు హెచ్చరికలు ● రాష్ట్రంలో 1,695 అనుమతి లేని విద్యాసంస్థలు

బెంగళూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి అత్యంత కీలకమైనది పదోతరగతి. ఎస్ఎస్ఎల్‌సీలో సాధించే మార్కులు, పేరు, జనతేదీతోపాటు అన్నింటికీ అదే కీలకంగా ఉంటున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలో ఏటా విద్యా మాఫియా కొనసాగుతోంది. అనుమతులు లేని విద్యాసంస్థలు కూడా ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో పాల్గొనేలా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసి దంతా చేస్తాయి. తరగతులు కొనసాగిస్తారు. విద్యాసంవత్సరం ప్రారంభంలో విద్యార్థులు లేదా తల్లిదండ్రులకు అనుమానం వస్తే విద్యాసంస్థ రెన్యువల్‌లో జాప్యమైందని కొన్నినెలల్లో ప్రక్రియ పూర్తి చేసుకుంటామని అడ్మిషన్లు కొనసాగిస్తారు. తీరా పరీక్షలు వచ్చినా వాటికి అనుమతులు మాత్రం ఉండవు. ఇలా ఏటా అనుమతి లేని విద్యాసంస్థలలో చేరే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్ఎస్ఎల్‌సీలో గందరగోళానికి తెర దించాలని పాఠశాల పరీక్షలు, మౌల్యమాపనామండలి హెచ్చరించింది. ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో విద్యార్థులు నమోదు చేసుకునేవేళ అనధికారిక పాఠశాల పట్ల జాగ్రత్తలు పాటించాలి. లేనిపక్షంలో తలెత్తే సమస్యలకు ప్రాంతీయ విద్యాశాఖ అధికారులు (బీఈఓ)లదే బాధ్యత అని పరీక్షా మండలి ఆదేశించింది. రాష్ట్రంలో గుర్తింపు పొందని ప్రైవేట్ పాఠశాలలను అనధికారిక జాబితాలో చేరుస్తారు. ఇలాంటి పాఠశాలల యాజమాన్యం, పర్యవేక్షకులు అనుమతులు వస్తాయంటూ జాప్యం చేస్తారు. కానీ పరీక్షలు సమీపిస్తున్నా వాటికి గుర్తింపు ఉండదు. దీంతో విద్యార్థులు అటు పరీక్షలు రాయలేక ఇటు మరో విద్యాసంస్థలో చేరలేక ఇబ్బంది పడుతుంటారు. గతంలో కొన్ని విద్యాసంస్థలు చివరిక్షణంలో కోర్టును ఆశ్రయించి అనుమతులు తీసుకొచ్చిన దాఖలాలు ఉన్నాయి. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితి వచ్చినప్పుడు విద్యాశాఖ అధికారులు, పరీక్షా మండలి విద్యార్థుల భవిష్యత్తుకు అంతరాయం కలగకుండా ఉండాలని ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేయించి పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తారు. 2025 విద్యాసంవత్సరంలో ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు మార్చిలో కొనసాగే అవకాశం ఉంది. ఏటా 15వేలకుపైగా విద్యాసంస్థలనుంచి 8 లక్షలమందికిపైగా విద్యార్థులు పరీక్షల్లో పాల్గొంటారు.

అనుమతులను నోటీసుబోర్డులో ఉంచాల్సిందే..

సాధారణంగా ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రాథమికోన్నత దాకా అనుమతులు పొంది ఆ తర్వాత ఎస్ఎస్ఎల్‌సీ వరకు అప్‌గ్రేడ్ చేసుకుంటారు. ఒకేసారి పదో తరగతి దాకా ప్రారంభించినా అందుకు తగినంతమంది విద్యార్థులు లేకున్నా ఉపాధ్యాయులు ఇతర సౌకర్యాలు సమకూర్చుకోవడం కష్టమవుతుంది. అయితే కొన్ని విద్యాసంస్థలు ముందస్తుగా అనుమతి లేకుండానే అడ్మిషన్లు చేసుకుంటుంటారు. ఇటువంటి గందరగోళం తరచూ తెరపైకి వస్తుంటుంది. కొన్ని సంస్థలు రెన్యువల్ చేసుకోకుండా నిర్లక్ష్యం చేస్తూ ఉంటాయి. అటువంటి విద్యాసంస్థలు కూడా అడ్మిషన్లు పరీక్షలకు అనుమతులు కోరుతుంటారు. అందుకే ప్రతి విద్యాసంస్థ పాఠశాల ప్రధానద్వారం వద్ద విద్యాశాఖ అనుమతుల వివరాలు, సౌకర్యాలను నోటీసుబోర్డులో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించినా అమలు చేసేవారు అరకొరగానే ఉన్నారు.

1,695 అనుమతిలేని విద్యాసంస్థలు

రాష్ట్రంలో 17,329 ప్రైవేట్ విద్యాసంస్థలు ఉన్నాయి. వీటిలో 36.34లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యాశాఖ అధికారిక సమాచారం ప్రకారం 1,695 అనుమతిలేని పాఠశాలలు ఉన్నాయి. గత ఏడాది అనధికారికంగా కొనసాగుతున్న పాఠశాలలను నియంత్రించేందుకు పలు ప్రయత్నాలు చేశారు. అయితే అది సాధ్యం కాలేదు. ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభమైన జూన్ నుంచే బీఈఓ కార్యాలయాలు వారి పరిధిలో అనధికారిక పాఠశాలల జాబితాను విడుదల చేశారు. అయితే వాటిని గుర్తించి వారికి నోటీసులు అందించి తగిన చర్యలు తీసుకునే విషయంలో పూర్తిస్థాయిలో అమలు కాలేదని తెలుస్తోంది. గత ఏడాది 130 పాఠశాలల 5వేల మంది విద్యార్థులను అనధికారికమని పరీక్షామండలి ప్రకటించింది. ఇటువంటి పాఠశాలలకు పరీక్షలు రాయించమని హెచ్చరించింది. అత్యవసరంగా కొంత గడువు ఇవ్వడంతో కొన్ని విద్యాసంస్థలు అనుమతులు పొందాయి. మిగిలిన పాఠశాలల విద్యార్థులు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల ద్వారా పరీక్షలు రాయించారు.

వివరాలను స్పష్టంగా గుర్తించాలి

అనుమతిలేని పాఠశాల వివరాలను స్పష్టంగా గుర్తించి నివేదిక తయారు చేయాలని ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికారిక విద్యాసంస్థల ప్రస్తావన ఉండరాదని గడిచిన కొన్నేళ్లుగా విద్యాశాఖ, పరీక్షా మండలి సూచిస్తోంది. అయినా ఏటా చివరిక్షణం దాకా ఈ గందరగోళం సాగుతూనే ఉంది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో అనధికారిక పాఠశాలలనుంచి విద్యార్థులు ఎవరూ పరీక్షలు రాయకుండా కట్టడి చేయాలని నిర్ణయించారు.



హెచ్చెల్సీ



నిరీక్షణ

నిధుల కోసం నీటి ప్రాజెక్టుల ఎదురుచూపు



జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులు నిధుల కోసం ఎదురు చూస్తున్నాయి. వైసీపీ పాలనలో జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులు నిధులు లేక నీరసించిపోయాయి. హెచ్చెల్సీ ఆధునికీకరణ, పీఏబీఆర్ పూర్తికి అవసరమైన భూసేకరణ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. హంద్రీనీవా కాలువ వెడల్పుతో పాటు డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం పట్ల గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించింది. జీడిపల్లి నుంచి కృష్ణా జలాలను తరలించేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన బీటీపీ, పేరూరు ప్రాజెక్టుల పనులను వైసీపీ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో సాగునీటి ప్రాజెక్టులు సకాలంలో పూర్తవుతాయని జిల్లా ప్రజలు, రైతులు ఆశాభావంతో ఉన్నారు.

- అనంతపురం క్లాక్‌టవర్, ఆంధ్రజ్యోతి



హంద్రీనీవా కాలువ

- వైసీపీ పాలనలో అన్ని ప్రాజెక్టులు నిర్వీర్యం
- ముందుకు సాగని హెచ్చెల్సీ ఆధునికీకరణ
- హంద్రీనీవా కాలువ వెడల్పు కథ అంతేనా..?
- అగమ్యగోచరంగా బీటీపీ, పేరూరు పరిస్థితి..!
- కూటమి ప్రభుత్వంలో మోక్షం కలిగేనా ?
- ప్రతిపాదనలు పంపిన జలవనరుల శాఖ అధికారులు



ప్రతిపాదనలకు స్పందన ఏదీ?

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం(హెచ్ఎన్ఎస్ఎస్) కింద ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3.45లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూ.1200కోట్లతో డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు పంపిన ప్రతిపాదనలు అలాగే ఉండిపోయాయి. గత ఐదేళ్లలో హంద్రీనీవా ఇంజనీర్లు సుమారు మూడు దఫాలుగా ప్రభుత్వానికి డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు పంపినా ఎలాంటి స్పందన లేదు. ఉరవకొండ ప్రాంతంలో గత టీడీపీ ప్రభుత్వం 38వేల ఎకరాలకు సంబంధించి పనులు ప్రారంభించినా, వైసీపీ ప్రభుత్వం వాటిని గాలికొదిలేసింది. గుంతకల్లు, గుత్తి పరిధిలోని 12మైనర్ ఇరిగేషన్ చెరువులకు ఫీడర్ చానల్ ద్వారా హంద్రీనీవా నీటిని అందించేందుకు రూ.20కోట్లతో చేసిన ప్రతిపాదలను వైసీపీ ప్రభుత్వం తిరస్కరించింది.

సీఎల్‌డీఐని రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వం

హంద్రీనీవా ద్వారా సాగునీరు అందని పొలాలకు నీటి సదుపాయం కల్పించడానికి గతంలో టీడీపీ ప్రభుత్వం సామూహిక బిందు సేద్యం (సీఎల్‌డీఐ) పథకాన్ని తీసుకువచ్చింది. ఉరవకొండ ప్రాంతంలోని బెళుగుప్ప, కూడేరు, ఉరవకొండ మండలాల్లో సుమారు 50వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.840కోట్లతో 2017లో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ సీఎల్‌డీఐ పథకాన్ని రద్దు చేసింది. ఇందుకు సంబంధించిన పరికరాలు మూలనపడేశారు. ప్రస్తుతం ఉరవకొండ నుంచి గెలిచి కూటమి ప్రభుత్వంలో ఆర్థికశాఖ మంత్రిగా కీలక స్థానంలో పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తుండటంతో నియోజకవ ర్గానికి దశ మారుతుందని అధికారులు చెబుతున్నారు.

బిల్లులన్నీ పెండింగ్‌లోనే..

గత టీడీపీ ప్రభుత్వం కరువు జిల్లాను సస్యశ్యామలం చేయాలని బీటీపీ, పేరూరు ప్రాజెక్టులను ఆమోదిస్తూ నిధులు కేటాయించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రెండు ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించింది. భైరవానితిప్ప ప్రాజెక్టుకు జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా నీటిని తరలించేందుకు 2018లో రాష్ట్ర ప్రభుత్వం రూ.541కోట్లు నిధులు కేటాయించింది. అయితే చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం రూ.20కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు డ్యాంకు నీళ్ల తరలించేందుకు అప్పర్ పెన్నా ప్రాజెక్టును రూ.591 కోట్లతో చేపట్టారు. 53 కిలోమీటర్ల కాలువ పనులతో పాటు సోమరవాండ్లపల్లి, పుట్టకనుమ తగరకుంట వద్ద రెండు జలాశయాలు నిర్మించాలని పనులు చేపట్టారు. ఇప్పటి వరకు రూ.164కోట్లు పనులు చేయగా రూ.100కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఆగిన హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు

హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులను గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం చేసింది. 2008-09లో రూ.458కోట్లతో హెచ్ఎల్ఎంసీ ఆధునికీకరణ ప్రారంభించారు. 2018వరకు రూ.310కోట్ల పనులు జరిగాయి. ఇక మిగిలిన రూ.148కోట్ల పనులను రద్దు చేస్తూ 2019లో ఏర్పాటైన వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పనులను అలాగే కొనసాగించి ఉంటే ఇప్పటికి పూర్తి అయ్యేవి. ప్రస్తుత ధరల ప్రకారం రూ.148కోట్ల పెండింగ్ పనుల విలువ రూ.500కోట్లకు చేరిందని హెచ్చెల్సీ అధికారులు, ఇంజనీర్లు చెబుతున్నారు. ఆధునికీకరణ పూర్తి చేస్తే 2600క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న కాలువను 4200క్యూసెక్కులకు పెంచుకునే అవకాశం ఉంటుంది. దీంతో టీబీ డ్యాం నుంచి అదనంగా వరద జలాలను జిల్లాకు తీసుకునే వెసులుబాటు కలుగుతుంది.

పీఏబీఆర్‌కు భూసేకరణే సమస్య

జిల్లాలో అతిపెద్ద రిజర్వాయర్ పెన్నా అహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్). దీని నీటి నిల్వ సామర్థ్యం 11టీఎంసీలు. ఇప్పటి వరకు ఎప్పుడూ 11టీఎంసీలు నిల్వ ఉంచలేదు. పూర్తి స్థాయిలో నీటిని నిల్వ ఉంచాలంటే మిగిలిన భూసేకరణ చేపట్టి, నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. పీఏబీఆర్ సామర్థ్యం అంచనా వేసేందుకు టెస్టుల చేయడానికి పూణేకు చెందిన సీడబ్ల్యూసీ కంపెనీ రూ.5కోట్లు అడిగింది. వైసీపీ ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. 11టీఎంసీల నీటిని నిల్వ చేయడానికి మరో రూ.450కోట్లు నిధులు అవసరం ఉంది. ఉంతకల్లు రిజర్వాయర్ డీపీఆర్‌కు అవసరమైన రూ.4.8కోట్ల విడుదలను కూడా వైసీపీ ప్రభుత్వం విస్మరించింది.

ప్రతిపాదనలు పంపాం



జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన ప్రాధాన్యతను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇటీవల రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి ఇంజనీర్ల అభిప్రాయా లను తీసుకున్నారు. హంద్రీనీవా కాలవ కింద డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు రూ.1200కోట్లు ప్రతిపాదనలు పంపాం. మడకశిర బైపాస్ కెనాల్, గుంతకల్లు, పుట్టపర్తి మైనర్ ఇరిగేషన్ చెరువులకు నీళ్ల నింపే ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందజేశాం. ఉరవకొండ ప్రాంతంలో సా మూహిక బిందు సేద్యం పథకాన్ని పునరుద్ధరిస్తే అద్భుతమైన ఫలితాలు వ స్తాయి. హంద్రీనీవా కాలువకు కాంక్రీట్ లైనింగ్ వేసి, డిస్ట్రిబ్యూటరీలను ని ర్మిస్తే ఉమ్మడి జిల్లాలో 3.45లక్షల ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలం అవుతుంది.

- నాగరాజ, జలవనరుల శాఖ ప్రాజెక్టుల సీఈ



తట్టఇడ్లీని బాక్స్‌లోకి వేస్తున్న నిర్వాహకుడు

‘తట్ట’ రుచే వేరు..!

ఆహారప్రియులను ఆకర్షిస్తున్న తట్ట ఇడ్లీ



కారంనెయ్యి కలిపిన తట్టఇడ్లీ

అనంతపురం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ఫుడ్ లవర్స్‌ను వివిధ రకాల వెరైటీలతో ఆకర్షిస్తుంటారు. రుచి, శుచితో పాటు ఇదీ మా ‘ప్రత్యేకత’ అని చెబుతుంటారు. ఈ కోవకు చెందినదే తట్ట ఇడ్లీ. సాధారణంగా మనకు తెలిసిన ఇడ్లీ అరచేతిలో పట్టేదిగా కాస్త అటూ ఇటుగా ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం భారీ సైజులో ఉంటుంది. సైజులోనే కాదు రుచిలో కూడా అద్భుతం అనేలా ఉంటుంది ఈ తట్ట ఇడ్లీ. ఇలాంటి భారీ ఇడ్లీకి కేరాఫ్ అడ్రస్‌గా మారింది నగరంలోని జేఎన్‌టీయూ కళాశాల ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న బెంగళూరు తట్ట ఇడ్లీ (బీటీఐ) హోటల్. ఇక్కడ భారీ ఇడ్లీకి కాంబినేషన్‌గా పప్పులచెట్నీ, అల్లంచెట్నీ, సాంబారు ఇస్తారు. అలాగే ఇడ్లీపైన మసాలాకారం, దానిపై నెయ్యివేసిమరో వెరైటీలో ఇడ్లీ ఇస్తున్నారు. ఇక్కడ ఉదయం రెండు ఇడ్లీలు తింటే మధ్యాహ్నం వరకు ఆకలి కాదని తిన్నవారు చెబుతుంటారు.

జీతాల కోతపై ఆగ్రహం

డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట వైద్య ఉద్యోగుల ఆందోళన



నిరసన చేపడుతున్న వైద్యశాఖ ఉద్యోగులు, ఎన్జీఓ నాయకులు

అనంతపురం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విధులలో ముఖహాజరు వేయలేదని జీతాలలో కోత పెట్టడంపై వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో దాదాపు 91మంది వైద్యసిబ్బందికి ఈనెల జీతాలలో భారీగా కోతపెట్టారు. దీంతో ఆదివారం ఎన్జీఓ నాయకుల మద్దతుతో వైద్యశాఖలోని ఎన్‌హెచ్ఎం వైద్యసిబ్బంది డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిం చారు. ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఎన్‌హెచ్ఎం వైద్యఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి తదితరులు మాట్లాడుతూ వైద్య ఉద్యోగుల వేతనాలకు ముఖ హాజరు(ఎఫ్ఆర్ఎస్) లింకు పెట్టడం అన్యాయమన్నారు. ఆన్‌లైన్ ముఖహాజరులో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. సర్వర్ సమస్యవల్ల చాలామంది విధులకు వెళ్లినా సకాలంలో హాజరు పడటం లేదన్నారు. ఇంకొంతమంది మహిళా వైద్యఉద్యోగులకు అదనంగా ఉన్న స్పెషల్ క్యాజువల్ లీవ్స్ చూపకపోవడం వల్లకూడా గైర్హాజరు కింద చూపిస్తోందన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి పనిచేసే వైద్య ఉద్యోగులకు ముఖహాజరు మినహాయించాలని ముందునుంచి కోరుతున్నామన్నారు. వెంటనే ప్రభుత్వం వేతనాల కోత నిర్ణయాన్ని విరమించుకోవాలని లేకపోతే పెద్దఎత్తున ఆందోలనలు చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. అనంతరం జిల్లావైద్యశాఖ ఏఓ గిరిజామనోహరను కలిసి వినతి పత్రం అందజేసారు. కార్యక్రమంలో ఎన్జీఓ నాయకులు శ్రీనివాస్‌కుమార్, జమీలాబేగం, శ్రీధర్‌బాబు పలువురు వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

డాడీ ఎక్కడా అంటే ఏమని చెప్పను..!

- వాడి అల్లరి భరించలేను.. లెయ్ మహేష్..
- మృతదేహం వద్ద విలపించిన భార్య
- ప్రమాదవశాత్తు వంకలోపడి వ్యక్తి మృతి



మృతదేహంపై పడి విలపిస్తున్న భార్య

పెనుకొండ టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ‘డాడీ ఎక్కడికి వెళ్లాడని అడిగితే ఏమని చెప్పను.. వాడి అల్లరి భరించడం నావల్ల కాదు.. లెయ్ మహేష్..’ అంటూ మృతుడిపై పడి భార్య ప్రవళిక బోరున విలపించిన సంఘటన అందరినీ కలిచివేసింది. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం బండపల్లి సమీపంలో ప్రమాదవశాత్తు వంగవేడు వంకలోపడి మహేష్(36) మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పెనుకొండ మండలం కోనాపురం గ్రామానికి చెందిన మహేష్ హిందూపురంలో నివాసముంటున్న అత్త కూతురు ప్రవళికను ఐదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావడంతో బెంగళూరులో నివాసముంటున్నారు. దీపావళి పండగను పురస్కరించుకుని బండపల్లికి వెళ్లారు. ఈ క్రమంలో మహేష్, భార్య ప్రవళిక, తమ్ముడు రాజేష్, అతడి భార్య శిరీష కలిసి గ్రామ సమీపంలోని వంగవేడు వంకలో ఈత కొట్టడానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు మహేష్ వంక ఉధృతికి కొట్టుకుపోయి ఇరుక్కుపోయాడు. రక్షించేందుకు తమ్ముడు, భార్య ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమీపంలో ఉన్న స్థానికులు వచ్చి బయటకు తీశారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య ప్రవళిక, కుమారుడు అగస్త్య ఉన్నారు. చిన్న వయసులోనే మహేష్ మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలతో ఆసుపత్రి ప్రాంగణం దద్దరిల్లింది.

రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెలు మృతి

- నిద్రమత్తులో లారీని ఢీకొట్టిన కారుడ్రైవర్
- మృతులు అనంతపురం జిల్లా వాసులు
- తూర్పుగోదావరి జిల్లాలో ఘటన



పుల్లలపాడు వద్ద జరిగిన ప్రమాదం

ఏలూరు క్రైం/నల్లజర్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో వృద్ధులైన అక్కా చెల్లెళ్లు మృతి చెందారు. డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడు గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం 5.30 గంటలకు జరిగింది. అనంతపురంలోని శారదానగర్‌కు చెందిన కనకదుర్గ (84) శ్రీసత్యసాయి విద్యాసంస్థలలో ప్రొఫెసర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆమె సోదరి రాజేశ్వరి (87)తో కలిసి ఉంటున్నారు. వీరిద్దరికీ వివాహం కాలేదు. వీరికి సంబంధించిన ఆస్తులు కాకినాడలో ఉన్నాయి. వాటిని అద్దెకు ఇచ్చారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వెళ్లి అద్దె వసూలు చేసుకుని వస్తూ ఉంటారు. దీనిలో భాగంగా అద్దె సొమ్ము వసూలు చేసుకోవడానికి రాప్తాడు మండలం రామినేపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ సాకే సూర్యనారాయణ (45)తో కలిసి కారులో ఈ నెల 2న సాయంత్రం 5 గంటలకు అనంతపురం నుంచి కాకినాడకు బయల్దేరారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో విజయవాడ దాటిన తరువాత ఓ పెట్రోల్ బంక్ వద్ద కారు ఆపి నిద్రించారు. తిరిగి 4.30 గంటలకు బయలుదేరారు. మార్గమధ్యలో నల్లజర్ల మండలం పుల్లలపాడు వద్ద జాతీయ రహదారిపై ఎలాంటి సిగ్నల్స్ లేకుండా ఒక లారీ ఆగి ఉంది. నిద్రమత్తులో దానిని గమనించని కారు డ్రైవర్ వేగంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కనకదుర్గ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన రాజేశ్వరి, సూర్యనారాయణలను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వచ్చిన కొద్ది సేపటికే రాజేశ్వరి మృతిచెందింది. ఆస్పత్రి ఐసీయూలో సూర్యనారాయణ చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. బంధువులకు పోలీసులు సమాచారం ఇచ్చారు.





ప్రమాదంలో మృతిచెందిన రాజేశ్వరి, కనకదుర్గ(ఫైల్ ఫొటోలు)

స్థలం విషయంలో ఘర్షణ

టీడీపీ కార్యకర్తలకు గాయాలు



గాయపడిన కరే వెంకటేష్

రాప్తాడు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగినేపల్లి గ్రామంలో ఇంటి దగ్గర స్థలం విషయంగా టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో టీడీపీ మద్దతుదారులైన కరే వెంకటేష్, కరే నారాయణమ్మ దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు తెలిపిన మేరకు.... భోగినేపల్లిలో కరే వెంకటేష్, కరే నారాయణమ్మ దంపతుల ఇంటి వద్ద స్థలం విషయమై గత వైసీపీ ప్రభుత్వంలోనూ ఘర్షణ జరిగింది. అప్పుడు కూడా వైసీపీ కార్యకర్తలు కరే వెంకటేష్, నారాయణమ్మ దంపతులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. తాజాగా ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో మరోసారి స్థలం విషయమై టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో వైసీపీ కార్యకర్తలైన కోలాల ప్రవీణ్, కోలాల ఉజ్జినప్ప, నాగమ్మ, కోలాల లక్ష్మీనారాయణమ్మలు టీడీపీ మద్దతుదారులైన కరే వెంకటేష్, కరే నారాయణమ్మ దంపతులపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వెంకటేష్, నారాయణమ్మ దంపతులను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితులు రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

‘సత్యంలోనే పరమాత్ముడి స్వరూపం’



అనుగ్రహభాషణం చేస్తున్న మల్లాది వేంకట రామనాథ శర్మ

అనంతపురం కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్యంలోనే భగవంతు డి స్వరూపం ఉందని బ్రహ్మశ్రీ మల్లాది వేంకట రామనాథ శర్మ పే ర్కొన్నారు. భారతీతీర్థ స్వామి సన్యాసాశ్రమ స్వీకార స్వర్ణోత్సవాలను పుర స్కరించుకుని శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠంలో ఆదివారం సా యంత్రం శ్రీముద్భాగవత సప్తాహం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాది వేంకట రామనాథశర్మ అనుగ్రహ భాషణం చేస్తూ... పరబ్రహ్మ లేకపోతే సృష్టే లేదన్నారు. శ్రీకృష్ణుడు తాను చేయాల్సిన కార్యాలన్నింటిని చేసిన తర్వాత దశావతారాలను చూపించారన్నారు. ప్రతిఒక్కరూ ఎల్లప్పుడూ భాగవత పఠనం చేసి సారాన్ని ఆస్వాదించాలని, అప్పుడు భగవంతుడి సాక్షాత్కారం జరిగినట్లేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో మఠం నిర్వాహకుడు సత్యప్రసాద్, మోహన్, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జిల్లాకు పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. ఏలూరులో ఆదివారం ఏపీ చెస్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ ర్యాంకింగ్ చెస్ టోర్న మెంట్-2024 పోటీలకు జిల్లా నుంచి పలవురు క్రీడాకారులు ప్రాతిని ధ్యం వహించారు. అండర్-8 బాలికల క్యాటగిరీలో మనస్వి మల్యా నాలుగో స్థానం, అండర్-10లో అవుటి సుకృత నాలుగో స్థానం, శారోన్ బ్లెస్సీ ఐదో స్థానం సాధించారు. అండర్-10 బాలుర క్యాటగిరీలో సాయి యశస్ మొదటి స్థానం, అండర్-14లో సాయి మనోజ్ కృష్ణ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు చెస్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

మా అమ్మ.. మాకొద్దు..!

- తిరుపతమ్మను తీసుకెళ్లేందుకు నిరాకరించిన బిడ్డలు
- పోలీస్‌స్టేషన్‌లో విచారించిన సీఐ జయన్న



వృద్ధురాలు తిరుపతమ్మ కుమారుడు, కుమార్తెలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ జయన్న

పత్తికొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ‘నడి రోడ్డుపై అమ్మ’ కథనం రాష్ట్ర వ్యాప్తంగా ఆవేదన కలిగించినా ఆమె కొడుకు, కుమార్తెల్లో ఇసుమంతైనా దయ కలగలేదు. తల్లిని తమతో తీసుకెళ్లే ప్రసక్తే లేదంటూ కొడుకు, కుమార్తెలు పోలీసుల ఎదుటే తేల్చి చెప్పారు. కన్నతల్లిని నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిన వృద్ధురాలు తిరుపతమ్మ కొడుకుతోపాటు కూతుళ్లకు పత్తికొండ సీఐ జయన్న ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. గుంతకల్లులో ఉన్న కొడుకు శ్రీనివాసులు, ఆయన భార్యతో పాటు బళ్లారిలో ఉంటున్న కుమార్తె, అల్లుడు, పత్తికొండలో ఉంటున్న మరో కుమార్తె, అల్లుడు ఆదివారం రాత్రి పత్తికొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఆసుపత్రిలో దయనీయ స్థితిలో ఉన్న తల్లిని తీసుకెళ్లాలని సీఐ వారికి సూచించారు. అయితే తమ ఆర్థిక పరిస్థితి బాగోలేదని, తాము తీసుకెళ్లే ప్రసక్తే లేదంటూ వారు స్పష్టం చేశారు. సీఐ ఎంత నచ్చచెప్పినా వారు వినలేదు. అయినప్పటికీ వారికి సోమవారం గడువు ఇస్తున్నామని, లేదంటే చట్టప్రకారం కేసు నమోదు చేయాల్సి ఉంటుందని సీఐ హెచ్చరించారు.

ఫ్యాక్టరీదే నిర్లక్ష్యం

- నిబంధనలు పాటించలేదని ప్రాథమిక నిర్ధారణ
- సప్తగిరి కర్పూరం కర్మాగారానికి షోకాజ్ నోటీసు

అనంతపురం టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శింగనమల మండలం లోలూరు వద్ద సప్తగిరి క్యాంఫర్ పరిశ్రమలో జరిగిన ఘటనపై విచారణ కమిటీ ఆదివారం రాత్రి ప్రాథమిక నివేదికను కలెక్టర్ వినోద్ కుమార్‌కు అందజేసింది. శుభ్రం చేసేటపుడు, వెల్డింగ్‌చేసే సమయంలో, కార్మికులు రియాక్టర్‌లోకి దిగేటపుడు పరిశ్రమ యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోలేదని విచారణ కమిటీ అధికారులు తేల్చారు.కనీసం ఆక్సిజన్ అందించే పరికరాలు కూడా కార్మికులకు అందించలేదని పేర్కొన్నారు. నివేదికను పరిశీలించిన కలెక్టర్ వినోద్‌కుమార్ ఫ్యాక్టరీల చట్టం ప్రకారం తొలుత సప్తగిరి క్యాంఫర్ పరిశ్రమ యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. పరిశ్రమ సమాధానం ఇచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

అమరన్ నటి ఇంట్లో సందడి

- హీరో శివకార్తికేయన్ సోదరిగా పెనుకొండ వాసి సుగమ్య శంకర్



నటి సుగమ్య శంకర్‌కు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

పెనుకొండ టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): వర్ధమాన నటి సుగమ్య శంకర్ ఇంట్లో ఆదివారం సందడి నెలకొంది. 2014లో కశ్మీర్‌లో వీరమరణం పొంది భారతదేశ అత్యున్నత పురస్కారమైన అశోకచక్ర బిరుదుతో గౌరవించిన గొప్ప సైనికుడు, తమిళనాడుకు చెందిన మేజర్ ముకుంద వరదరాజన్ జీవితం ఆధారంగా తెరకెక్కించిన సినిమా అమరన్. ఈ చిత్రంలో మేజర్ ముకుంద వరదరాజన్ పాత్రలో నటించిన శివకార్తికేయన్ సోదరి నిత్య వరదరాజన్‌గా పెనుకొండకు చెందిన సుగమ్య శంకర్ నటించారు. ఈ చిత్రం విజయవంతం కావడంతో కుటుంబ సభ్యులు నటి సుగమ్యకు స్వీట్లుపెట్టి సంతోషం వ్యక్తం చేశారు. పెనుకొండ వాసులతో కలిసి స్థానిక థియేటర్‌లో ఆమె సినిమా చూశారు. ఈ సందర్భంగా నటి మాట్లాడుతూ చైల్డ్ ఆర్టిస్ట్‌గా నాగభరణి, మర సినిమాల్లో నటించినట్లు తెలిపారు. వీరమరణం పొందిన మేజర్ సోదరిగా నటించడం గర్వంగా ఉందన్నారు. దేశానికి సంబంధించిన ఆర్మీ వారి జీవిత చరిత్ర సినిమాలో అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. మరో మూడు సినిమాల్లో నటిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తండ్రి రవిశంకర్‌గురుజీ, తల్లి గాయత్రి, అన్న సునాగ్ శంకర్ భరద్వాజ్ సినిమా విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

శకుంతలా దేవి (జయంతి)



హ్యూమన్ కంప్యూటర్‌గా పేరొందిన శకుంతలా దేవి 1929 నవంబరు 4న బెంగళూరులో జన్మించారు. రచయిత, మెంటల్ కాలిక్యులేటర్‌గా రాణించారు. 1982లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు పొందారు. చిన్నతనం నుంచే అసాధారణ ప్రతిభ కనబరిచారు. అర్థమెటిక్ ఎబిలిటీస్‌లో మైసూరు యూనివర్శిటీలో ఆమె ప్రతిభా ప్రదర్శన ఎంతో పేరొందింది. నవలలు, చిన్నకథలతోపాటు మ్యాథ మ్యాటిక్స్, కుక్కింగ్, పజిల్స్, అస్ట్రాలజీపై రచనలు చేశారు. 2013 ఏప్రిల్ 21న కన్నుమూశారు. కాగా 84వ జయంతికి గూగుల్ డూడుల్ ఏర్పాటు చేసింది.

జైకిషన్ (జయంతి)




సంగీతద్వయం శంకర్-జైకిషన్ ద్వయంలో హార్మోనిస్టుగా జైకిషన్ రాణించారు. 1929 నవంబరు 4న గుజరాత్ రాష్ట్రంలో జన్మించారు. హిందీ సినీరంగంలో తొలి సంగీత ద్వయం, 1949 నుంచి 1971 వరకు అంటే తుదిశ్వాస వరకు కలసి సాగారు. రాజ్‌కపూర్ ఫిల్మ్స్‌కు 'హౌస్ కంపోజర్స్'గా వ్యవహరించారు. 9సార్లు ఉత్తమ సంగీత దర్శకులుగా పురస్కారం, పద్మశ్రీ అవార్డు పొందారు. 1971 సెప్టెంబరు 12న జైకిషన్ కన్నుమూశారు.

శంభు మహరాజ్ (వర్ధంతి)



'పద్మశ్రీ' గ్రహీత పండిట్ శంభు మహరాజ్ 1910లో జన్మించారు. క్లాజికల్ డ్యాన్స్ కథక్‌లో గురుగా రాణించారు. లఖ్‌నవ్ భారతీయ కళా కేంద్రంలోని కథక్ నృత్య విభాగాధిపతిగా వ్యవహరించారు. ఆయన వద్ద శిక్షణ పొందిన శిష్యులు సైతం కథక్‌లో రాణించారు. సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ గ్రహీత. ఆయన మేనల్లుడు బిర్జు మహరాజ్ కూడా కథక్‌లో పేరొందారు. శంభు మహరాజ్ 1970 నవంబరు 4న కన్నుమూశారు.

ఈఎస్ఎల్ నరసింహన్ (పుట్టినరోజు)



ఈక్కాడు శ్రీనివాసన్ లక్ష్మీ (ఈఎస్ఎల్) నరసింహన్ 1945 నవంబరు 4న జన్మించారు. 1968వ సంవత్సర ఐపీఎస్ బ్యాచ్ అధికారి. తమిళనాడు రాష్ట్రానికి 12ఏళ్లపాటు గవర్నర్‌గా వ్యవహరించి దేశంలో సుదీర్ఘకాలం కొనసాగిన గవర్నర్‌గా గుర్తింపు పొందారు. మద్రాస్ లా కళాశాల నుంచి డిగ్రీ పట్టా అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి గవర్నర్ ఆయనే. అంతకుమునుపు ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు కూడా గవర్నర్‌గా వ్యవహరించారు. ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌గా, మాస్కోలోని ఇండియన్ ఎంబసీకి 1981 నుంచి 1984వరకు తొలి సెక్రటరీగా వ్యవహరించారు. ప్రస్తుతం రిటైరై సొంత ప్రాంతం చెన్నైలో నివసిస్తున్నారు.

పండుగకు వచ్చి.. పరలోకానికి..

● ఈతకు వెళ్లి వ్యక్తి మృతి



మహేశ్ (ఫైల్)

కొత్తచెరువు/పుట్టపర్తిరూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పెనుకొండ మండలం కోనాపురం గ్రామానికి చెందిన మహేశ్(36) దీపావళి పండుగకు చిన్నాన్న పురుషోత్తం ఇంటికి వచ్చి మృత్యువాత పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మహేశ్ ఆయన భార్య ప్రవల్లిక, కుమారుడు, మహేశ్ తమ్ముడు దీపావళిపండుగకు చిన్నాన్న స్వగ్రామం కొత్తచెరువు మండలం నారాయణపురానికి వచ్చారు. పండుగ అనంతరం ఆదివారం గ్రామ సమీపంలోని వంగపేరు నది వద్దకు ఈతకు వెళ్లారు. అక్కడ మహేశ్ సరదాగా నీళ్లలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నదిలో పడ్డాడు. నది లోతుగా ఉండటంతో అక్కడ మునిగిపోయాడు. గమనించిన భార్య, తమ్ముడు గట్టిగాకేకలు వేయడంతో సమీపంలోని రైతులు వచ్చి నదిలో గాలించి బయటకు తీశారు. అయితే అప్పటికే మహేశ్ మృతిచెందినట్లు వారు తెలిపారు. ఈయన బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. పండుగకు వచ్చి మృత్యువాత పడటంతో కుటుంబసభ్యులు, బంధువులు రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న పుట్టపర్తి రూరల్ సీఐ సురేశ్ కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కనుమరుగు కానున్న సరస్వతి థియేటర్

బెంగళూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక నగరి మైసూరులో మూడు దశాబ్దాలపాటు ప్రేక్షకులను అలరించిన సరస్వతి థియేటర్ ఇక కనుమరుగు కానుంది. కొవిడ్ క్లిష్ట సమయంలో ప్రేక్షకుల కొరత సహా పలు కారణాలతో ఈ థియేటర్ మూతబడింది. 1990లో నిర్మించబడిన సరస్వతి థియేటర్ సినీ ప్రియులను ఆకట్టుకుంది. మైసూరు నగరం నుంచే కాకుండా గ్రామీణ ప్రాంతాలవారుసైతం పెద్ద, కొత్త సినిమాలను వీక్షించేందుకు ఆసక్తిగా వచ్చేవారు. సరస్వతి థియేటర్ మైసూరు నగరంలోనే కాకుండా జిల్లాలోనూ ప్రసిద్ధి చెందింది. ఎక్కువగా పునీత్‌రాజ్‌కుమార్ సినిమాలు ప్రదర్శించబడ్డాయి. థియేటర్‌కు రాజ్‌కుమార్ కుటుంబానికి అవినాభావ సంబంధం ఉంది. కొవిడ్ అనంతరం ఆర్థిక సంక్లిష్టం నెలకొంది. మైసూరు నగరంలో కొంతకాలంగా ఒక్కో థియేటర్ మూతబడుతోంది. నగరంలో 16 సినిమా థియేటర్‌లు ఉండేవి. కొవిడ్‌కు ముందు రణజిత్, ఓపెరా, స్టెర్లింగ్, శాలిమార్ థియేటర్‌లు మూతపడ్డాయి. కొవిడ్ అనంతరం శ్రీనాగరాజ్, శాంతలా, లక్ష్మి, సరస్వతి థియేటర్‌లు మూసేశారు. ఇంకొన్ని థియేటర్లు కూల్చి వేశారు కూడా ప్రస్తుతం ఈబాటలో సరస్వతి థియేటర్ చేరుతోంది. ఇలా సినిమా థియేటర్లు జ్ఞాపకాలుగా మాత్రమే మిగలనున్నాయి.



సరస్వతి థియేటర్ (ఫైల్)

ఆనూరులో కన్నడ రాజ్యోత్సవం



స్థానిక ప్రముఖులను సన్మానిస్తున్న ఆనూరు దేవరాజ్ తదితరులు

శిడ్లఘట్ట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తాలూకాలో పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని ఆదర్శరైతు, కాంగ్రెస్ యువనాయకుడు ఆనూరు దేవరాజ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని ఆనూరు గ్రామంలో కర్ణాటక రత్న పునీత్ రాజ్ కుమార్ స్మరణార్థం 69వ కన్నడ రాజ్యోత్సవాన్ని మరింత అర్థవంతంగా ఆచరించారు. పునీత్‌రాజ్‌కుమార్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కన్నడ రాజ్యోత్సవ జిల్లా పురస్కార గ్రహీత అంబారి మంజునాథ్, కళాకారుడు సీఎస్ మునిరాజులను ఆనూరు గ్రామ సమాజసేవకుడు, కాంగ్రెస్ నాయకుడు ఆంజినప్ప అభిమనుల సంఘం, గ్రామపంచాయతీ సభ్యురాలు లతా దేవరాజ్, ప్రముఖులు ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సభ్యురాలు లతా దేవరాజ్, గ్రామ ప్రముఖులు చిక్కణ్ణ, కృష్ణప్ప, చంద్రణ్ణ, నరసింహమూర్తి, మునిరెడ్డి, ఆంజినప్ప, మునికృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు సత్కారం

బెంగళూరు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): కావ్యశ్రీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కన్నడ సాహిత్య సమ్మేళనంలో భాగంగా సమ్మేళనం అధ్యక్షుడు డాక్టర్ వాదిరాజ్ తదితరులను ఆత్మీయంగా సత్కరించారు. నగరంలో ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో డాక్టర్ ఆరూఢ భారతిస్వామి, సుబ్బు హొళెయార్, డాక్టర్ రామలింగేశ్వర, డాక్టర్ శివణ్ణ తదితరులు పాల్గొన్నారు. కన్నడ భాషా సంస్కృతులకు ప్రతిఒక్కరూ సహకరించాలని వక్తలు అభిప్రాయపడ్డారు.



డాక్టర్ వాదిరాజ్ తదితరులకు సన్మానం

మ్యూజియంగా మారనున్న మైసూరు జిల్లాధికారి కార్యాలయం

బెంగళూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక నగరం మైసూరులోని పాత జిల్లా అధికారి కార్యాలయ భవనం మ్యూజియంగా మారనుంది. మైసూరు నగర వైభవం, పరంపర, చరిత్రలో ఎన్నో అంశాలు ఉన్నాయి. ఈ జాబితాలో పాత జిల్లా అధికారి భవనం మ్యూజియంగా మారి పర్యాటకులను ఆకర్షించనుంది. కన్నడ సంస్కృతిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ మైసూరు జిల్లా అధికారి కార్యాలయం నూతన భవనంలోకి మారడంతో పాతభవనం ఖాళీగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో పాతభవనాన్ని మ్యూజియంగా మార్చి కన్నడభాష గొప్పదనాన్ని ప్రపంచానికి తెలియ చేయనున్నట్టు తెలిపారు.



మైసూరు జిల్లా అధికారి పాత కార్యాలయం

భాషాసంస్కృతుల పరిరక్షణ అందరి బాధ్యత



శివప్రసాద్‌కు ఆత్మీయ సన్మానం

బంగారపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భాషా సంస్కృతులను భావితరాలకు అందించాలని, గొప్ప చరిత్ర, భవ్య పరంపర, సంస్కృతి కల్గిన పుణ్యభూమి కన్నడనాడు అని ఈనేలపై జన్మించడానికి మనం ఎంతో పుణ్యం చేసుకున్నామని ఎమ్మెల్యే నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కువెంపు సర్కిల్‌లో కన్నడసంఘం ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని కన్నడమాత భువనేశ్వరిదేవికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ కన్నడద కులపురోహితగా పేరొంది ఆలూరు వెంకటరాయరు 1905లో కర్ణాటక ఏకీకరణ ఉద్యమం ప్రారంభించారని, 1950లో భారతదేశం గణతంత్రదేశంగా మారిందన్నారు. అనంతరం భాషా ప్రాతిపదికన రాష్ట్రాల విభజన కావడంతో మైసూరు రాష్ట్రంగా ఏర్పడిందని, తదుపరి కర్ణాటక నామకరణం చేశారన్నారు. కర్ణాటక జానపద అకాడమీ అధ్యక్షుడు గొల్లహళ్ళి శివప్రసాద్ మాట్లాడుతూ మాతృభాష కన్నడను వ్యవహారికంలో వినియోగించడంతోపాటు ఇతరులతోనూ కన్నడలో మాట్లాడాలని అభిప్రాయపడ్డారు. కన్నడేతరులకు కన్నడభాషను నేర్పాలన్నారు. కన్నడభాషకు 2వేల సంవత్సరాల చరిత్ర ఉందని, శాస్త్రీయహోదా అందుకే దక్కిందన్నారు. మన భాషా సంస్కృతుల పరిరక్షణకు అందరూ సహకరించాలన్నారు. పురసభ అధ్యక్షుడు గోవింద, సీఐ నంజప్ప తదితరులు పాల్గొన్నారు.

సంగీతానికి భాష ముఖ్యం కాదు

» మాజీ లోకాయుక్త సంతోష్‌హెగ్డే

బెంగళూరు, నవంబరు3(ఆంధ్రజ్యోతి): సంగీతానికి భాష ముఖ్యం కాదని భారతీయ సంస్కృతిలో ఒక భాగమని మాజీ లోకాయుక్త సంతోష్‌హెగ్డే అభిప్రాయపడ్డారు. నగరంలోని గాయన సమాజ ఆధ్వర్యంలో ఆదివారం 54వ సంగీత సదస్సు జరిగింది. తుమకూరు రామకృష్ణమఠం ముఖ్యులు వీరేశానంద సరస్వతి, డాక్టర్ ఎంఆర్‌వి ప్రసాద్, విద్వాన్ హెచ్ఎస్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. సంతోష్ హెగ్డే మాట్లాడుతూ సంగీతం ఎటువంటివారినైనా మంత్రముగ్ధులను చేస్తుందన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న మాజీ లోకాయుక్త సంతోష్‌హెగ్డే తదితరులు

ఆసుపత్రుల్లో దీపావళి బాధితులు



మింటోలో పరామర్శిస్తున్న వైద్యబృందం

బెంగళూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వేళ బాణాసంచా కాల్చేవేళ చోటు చేసుకున్న ప్రమాదాలతో గాయపడిన వారు నగరవ్యాప్తంగా పలు ఆసుపత్రులలో చికిత్సలు పొందుతున్నారు. ప్రత్యేకించి కంటికి గాయాలైనవారికి విక్టోరియాకు అనుబంధమైన మింటో ఆసుపత్రిలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేసి చికిత్సలు అందిస్తున్నారు. మూడురోజుల్లో వందమందికిపైగా చికిత్సలు పొందినట్టు సమాచారం. ఆదివారం కూడా ఇంకా చికిత్సలు పొందుతున్నవారి సంఖ్య పదులలో ఉంది. ఇక నారాయణ నేత్రాలయ ఆసుపత్రిలోనూ అత్యవసర విభాగంలో 73మంది చికిత్సలు పొందినట్టు డాక్టర్ రోహిత్‌శెట్టి తెలిపారు. పెద్దలు 38 మంది, పిల్లలు 35మంది ఉన్నారన్నారు. పండుగ ఉత్సాహంలో బాణాసంచావేళ కనీస జాగ్రత్తలు పాటించకపోవడమే ప్రమాదానికి కారణమని అభిప్రాయపడ్డారు. ప్రమాదాల నియంత్రణకు ప్రజ లలో మరింత చైతన్యం పెరగాల్సి ఉందన్నారు.

ఉచిత యోగా శిబిరం



పతంజలి యోగా శిబిరంలో నిర్వాహకులు తదితరులు

శిడ్లఘట్ట, నవంబరు3(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట పట్టణంలో పతంజలి యోగ శిక్షణ సమితి ఆధ్వర్యంలో ఉచిత యోగా శిబిరం నిర్వహించనున్నారు. పతంజలి యోగాధ్యయనం, పరిశోధనా కేంద్రం మైసూరు, తుమకూరు సౌకార్థిక విభాగం శిడ్లఘట్ట శాఖ సహకారంతో 56వ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. 14ఏళ్ల పైబడిన స్త్రీ, పురుషులకు అవకాశం కల్పించారు. రామస్వామి నేతృత్వంలో ఏర్పాటైన యోగా శిబిరం క్రమంగా వ్యాపించిందని నిర్వాహకులు తెలిపారు. క్రమం తప్పని యోగా ద్వారా చక్కటి ఆరోగ్యం సాధ్యమన్నారు. మనజీవనశైలిలో యోగా భాగస్వామ్యం కావాలన్నదే తమ అభిలాష అన్నారు. శిబిరం 48 రోజులపాటు ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహేశ్వరి దేవాలయం సోమవారం సాయంత్రం 7 గంటలకు శిబిరం ఉంటుందన్నారు.

నేత్రావతి నదిలో దంపతుల మృతదేహాలు లభ్యం



మద్దిరెడ్డి, ఈశ్వరమ్మ (ఫైల్)

చింతామణి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణంలోని కన్నంపల్లి లేఅవుట్‌లో కనిపించకుండా పోయిన దంపతులు ధర్మస్థళలోని నేత్రావతి నదిలో శవాలై కనిపించారని చింతామణి రూరల్ పోలీసులు తెలిపారు. తాలూకాలోని ముంగానహళ్ళి హోబళి రాయప్పల్లి గ్రామంలో రిటైర్డు పశువైద్యుడు డాక్టర్ మద్దిరెడ్డి (60), భార్య ఈశ్వరమ్మ (52)లు మృతులుగా గుర్తించారు. పదినెలలక్రితం మద్దిరెడ్డి రిటైరయ్యారు. అక్టోబరు 31న సాయంత్రం ఇంటినుంచి దంపతులు వెళ్లినట్టు సీసీటీవీ ఫుటేజీలో రికార్డు అయ్యింది. తల్లిదండ్రులు కనిపించ లేదంటూ కుమారుడు రాహుల్ నవంబరు 1న ఫిర్యాదు చేశారు. కాగా దంపతులు ధర్మస్థళకు కేఎస్ఆర్టీసీ బస్సులో వెళ్లినట్టు సమా చారం అందడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేశారు. శనివారం ధర్మస్థళకు చేరుకుని అక్కడ గాలింపులు చేయగా నేత్రా వతి నదిలో తేలుతున్న రెండు శవాలను బయటకు తీయడంతో చింతామణి వాసులుగా నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. జీవితంపై విరక్తితోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు ప్రాథమికంగా భావించారు. కాగా వీరి అంత్యక్రియలు సోమవారం జరగ నున్నాయని బంధువులు వెల్లడించారు.

కేసు నమోదు

కదిరి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పూల బజారులో శనివారం జరిగిన దాడి కేసులో పూలబజారుకు చెందిన బాలమురళీకృష్ణ అలియాస్ బాలుపై హత్యాయత్నం కేసు నమోదైనట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పూలబజారులోని ఆకుతోట వద్ద కొండరాసి హరిప్రసాద్ ఉండగా, బాలు తోట వద్ద టపాసులు కాలుస్తున్నాడు. బాలుకు అక్కడున్న వారు పక్కకెళ్లి కాల్చాలని సూచించారు. అలా చెప్పినందుకు బాలు తనపై ఇటికపెల్లతో దాడిచేసి తలపై తీవ్రంగా గాయపరిచి, తనను చంపాలని చూశారని, హరిప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. అతని ఫిర్యాదు మేరకు బాలుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

భలే యాపారం..!

● హెల్పర్ల ప్రమోషన్‌కూ వసూళ్లు
● మధ్యవర్తిగా వైసీపీ నాయకుడు
● ఆఫీసుకు ఎప్పుడొస్తారో కూడా తెలియదు



కళ్యాణదుర్గం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అడిగేవారు లేకపోవడంతో ఆ ఉన్నతాధికారి చెలరేగిపోతున్నారు. అక్రమాలకు పాల్పడుతూ రూ.లక్షలు పోగేస్తున్నారు. నియోజకవర్గంలోని ఐసీడీఎస్ శాఖలో పోస్టుల అమ్మకంతో సొమ్ములు వెనకేసుకుంటున్నారు. లంచాలు పుచ్చుకుని హెల్పర్లకు ఉద్యోగోన్నతి కల్పించారు. అలాగే నోటిఫికేషన్ లేకుండానే కొన్ని పోస్టులను భర్తీ చేశారు. ఓ వైసీపీ నాయకుడిని మధ్యవర్తిగా పెట్టుకుని వసూళ్ల వ్యవహారం నడిపారు. అప్పట్లో మంత్రిగా పని చేసిన ఉషశ్రీచరణ్ అండదండలు కూడా ఆ ఉన్నతాధికారికి ఉండటంతోనే అక్రమంగా పోస్టులను భర్తీ చేసినట్లు సమాచారం.

కూటమి ప్రభుత్వం రాకతో వణుకు

కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఆ ఉన్నతాధికారిలో వణుకు మొదలైంది. పోస్టుల భర్తీ విషయంలో ఎప్పుడు, ఎవరు ఏమి అడుగుతారోనని తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఐసీడీఎస్ పీడీల ద్వారా నోటిఫికేషన్ వెలువడిన తర్వాతనే పోస్టులను భర్తీ చేసేందుకు అవకాశం ఉంటుంది. కానీ ఇవేవీ పట్టించుకోకుండా ఆ అధికారి పోస్టులను భర్తీ చేసేశారు. ఒక్కో పోస్టుకు రూ. లక్ష నుంచి రూ. 2.5 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. ఆ ఉన్నతాధికారికి, ఓ జూనియర్ అసిస్టెంట్ కూడా తోడైనట్లు సమాచారం. వీరిద్దరూ కుమ్మక్కై పోస్టులను భర్తీ చేయడంలో ప్రధాన పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. అక్రమ వసూళ్ల ద్వారా వచ్చిన సొమ్మును వీరిద్దరూ వాటాలు వేసుకుని పంచుకున్నట్లు సమాచారం. వైసీపీ హయాంలో ప్రశ్నించే వారు లేరన్న ధీమాతో పోస్టులను ఎడాపెడా భర్తీ చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఆఫీసుకు వస్తే ఒట్టు ..!



ఆ ఉన్నతాధికారి ఏ మాత్రం కార్యాలయానికి రారు. ఎప్పుడూ ఆడ మీటింగ్ ఉంది, ఈడ మీటింగ్ ఉందని చెబుతుంటారు. ఈక్రమంలో ఆ అధికారి ఆఫీసుకు వచ్చేది లేనిది ఎవరికీ తెలియకుండా పోతోంది. కనీసం ఆ కార్యాలయంలో పని చేసే సిబ్బందికి కూడా తెలియదంటే ఆ అధికారి పని తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈక్రమంలోనే సూపర్‌వైజర్లు సైతం విధులకు ఇష్టానుసారం వస్తున్నారు. దీంతో అంగన్‌వాడీల పనితీరు అధ్వానంగా మారింది. ప్రతి రోజు జిల్లా కేంద్రం నుంచి సూపర్‌వైజర్లు వచ్చి పోతుంటారు. వీరి పనితీరుపై ఆరా తీసే ఉన్నతాధికారి కూడా విధులకు సక్రమంగా రాకపోవడంతో సూపర్‌వైజర్లు విధులకు డుమ్మా కొడుతున్నారు. ఓ మండల కేంద్రంలో పౌష్టికాహారం అంతా డంప్ చేసుకుని, సూపర్‌వైజర్లు, అక్కడ ఉన్న సిబ్బంది దాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు సమాచారం. వైసీపీ హయాంలో పౌష్టికాహారాన్ని అంతా ఒకచోట డంప్ చేసి కర్ణాటక ప్రాంతానికి తరలించి అమ్ముకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా ఆ ఉన్నతాధికారి, సూపర్‌వైజర్ల కనుసన్నల్లోనే నడిచిందని సమాచారం. వారంలో ఒక రోజు మాత్రమే విధులకు వచ్చి, నానా హడావుడి చేసి వెళ్లిపోతారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు ఏ విధంగా ఉందోనని అడిగే నాథుడే లేడనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఆ ఐసీడీఎస్ కేంద్ర పాలన అంతా భ్రష్టుపట్టింది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ కార్యాలయ పనితీరుపై నిఘా ఉంచాలని పలువురు కోరుతున్నారు.

ఆరోపణలు వాస్తవమే

అంగన్‌వాడీ పోస్టుల భర్తీ విషయంలో ఆ సీడీపీఓపై ఆరోపణలు వచ్చిన మాట వాస్తవమే. దానిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు కూడా చేపట్టాం. అయితే నాకంటే ముందు పీడీగా పనిచేసిన ఓ అధికారి కూడా ఆ పోస్టుల భర్తీ విషయంలో విచారణ చేపట్టారు. అప్పట్లో వ్యవహారం అంతా ఓ కొలిక్కి వచ్చింది. నేను బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆ అధికారిపై ఎటువంటి ఫిర్యాదు రాలేదు. ఎవరైనా ఆధారాలు సమర్పిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

-డాక్టర్ బీఎస్ శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,607.07
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	11,860	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11,620	9,017
నీటి నిల్వ (టీఎంసీలు)	101.77	32.15

సండూరులో సై అంటే సై..!

● కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం ● అసంతృప్తులకు గాలం వేస్తున్న ఇరు పార్టీల నేతలు



బళ్లారి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి. కంచుకోటగా ఉన్న నియోజకవర్గాన్ని చేయిజార్చుకోరాదని హస్తం, సండూరు గడ్డపై ఎలాగైనా కాషాయ జెండా ఎగరవేయాలని బీజేపీ నేతలు ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బి.ఎస్ విజయేంద్ర, కేంద్ర మంత్రి ప్రహ్లద్ జోషి, మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, స్థానిక బీజేపీ నాయకులు సండూరులో పాగా వేశారు. ఊరూరా ప్రచారం చేపడుతూ ఓటర్లను గుక్క తిప్పుకోకుండా చేస్తున్నారు. ఇక కాంగ్రెస్‌లో మంత్రి సంతోష్ లాడ్, ఎంపీ తుకారాం, అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. ఈనెల 13న ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రెండు పార్టీలూ ఎత్తులు, పై ఎత్తులు వేస్తూ సై సవాల్ గా నిలుస్తున్నాయి.

సండూరు తాలూకాలో ప్రతి గ్రామంలోనూ ఓటర్లను కలుస్తూ అభ్యర్థులు ఓట్లు అభ్యర్థిస్తున్నారు. చాలా కాలంగా సండూరు ఎమ్మెల్యేలుగా తుకారాం, అంతక ముందు ఉన్న మంత్రి సంతోష్ లాడ్ సండూరుకు ఏమి చేశారో చెప్పమనండి అంటూ బీజేపీ సవాల్ విసురుతోంది. బీజేపీని గెలిపించడం అభివృద్ధి చేసి చూపుతాం అని గట్టిగానే హామీ ఇస్తున్నారు. గాలి జనార్దన్‌రెడ్డి తో పాటు ఆయన భార్య గాలి లక్ష్మి అరుణ కూడా ప్రచారజెండా పట్టింది. బీజేపీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తున్నామని అంటున్నారు. వీరితో పాటు అభ్యర్థి బంగారు హనుమంత, ఆయన భార్య బంధువులు కూడా ప్రచారం వేగం చేశారు.

కాంగ్రెస్‌లో అభ్యర్థి అన్నపూర్ణ, మంత్రి సంతోష్ లాడ్ ప్రచారం వేగం చేస్తున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటును అభ్యర్థిస్తున్నారు. వచ్చిపోయే నాయకులను నమ్మొద్దండి..నేను లోకల్ అంటూ ప్రచారంలో జోరు పెంచుతున్నారు. కాంగ్రెస్ గెలుపుతోనే గ్యారెంటీల అమలు సాధ్యమని ఓటర్లకు సూచిస్తున్నారు. మాజీ మంత్రి శ్రీరాములు ఇక్కడ ఏమి అభివృద్ధి పనులు చేశారు. ఆయన ఏరోజైనా ఇచ్చిన మాట నిలుపుకున్నారా..? అలాగే 2004 నుండి 2010 వరకూ జనార్దన్‌రెడ్డి ఇక్కడ చేసిన దోపిడీ గురించి తెలుసు కదా. ఈరోజు సండూరులో మైనింగ్ బంద్ కావడానికి కారణం జనార్దన్‌రెడ్డి కారణం కాదా.? అని ప్రశ్నిస్తున్నారు. కుడితినిలో భూములు తీసుకున్న రైతులకు ఏమి న్యాయం చేశారని ప్రశ్నిస్తున్నారు. ఇలా బీజేపీ నేతలపై కాంగ్రెస్ నాయకులు దాడి చేస్తున్నారు. ఇక అసంతృప్తులను లాగేందుకు ఇరు పార్టీల నేతలు ప్రయత్నిస్తున్నారు. తటస్థ ఓటరు, నిశబ్ద ఓటరు, పార్టీల్లో అసంతృప్తిలో ఉండే ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలూ మొదలయాయి. మొత్తం మీద సండూరు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకులు సై అంటే సై అంటున్నారు.

కన్నయ్య నాయుడుకు పురస్కారంపై హర్షం



బళ్లారి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): డ్యామ్ క్రస్ట్ గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడుకు కర్ణాటక ప్రభుత్వం రాజ్యోత్సవ పురస్కారం ప్రకటించడం పట్ల టీబీ బోర్డు ఉద్యోగులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 10వ తేదీ తుంగభద్ర డ్యాం క్రస్ట్ గేటు కొట్టుకుపోయి, నీరు వృథాగా వెళ్లిపోసాగాయి. ఇలాంటి సమయంలో కన్నయ్య నాయుడు ఆపద్బాంధవుడిలా మారి క్రస్ట్ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ అమర్చి డ్యాం నుంచి నీటి వృథాను అరికట్టాడు. క్రస్ట్ గేటు తెగిన సమయంలో కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల మంత్రులు అక్కడికి చేరుకున్నారు. కన్నయ్యనాయుడుపై నమ్మకం ఉందనీ, క్రస్ట్ గేటు స్థానంలో కొత్తగా స్టాప్‌లాగ్ అమర్చి నీటి వృథాను అరికడతారని స్వయానా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా కన్నయ్యనాయుడును అప్పట్లోనే సన్మానించారు. ప్రస్తుతం కర్ణాటక సర్కారు రాజ్యోత్సవ పురస్కారాన్ని కన్నయ్యనాయుడుకు ప్రకటించడం హర్షదాయకమని టీబీ బోర్డు ఉద్యోగులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కన్నడిగుల ప్రోత్సాహం మరువలేనిది

రాయచూరు: తుంగభద్ర డ్యాం వద్ద విరిగిపోయిన క్రస్ట్‌గేట్ నిర్మాణం సందర్భంగా కర్ణాటక ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సహం కన్నడ ప్రజలు చూపించిన అభిమానం మరువలేనిదని వారికి జీవితాంతం రుణపడి ఉంటానని క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్య నాయుడు అన్నారు. ఆదివారం నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో తనను కలిసిన విలేకరులతో మాట్లాడిన కన్నయ్య నాయుడు, తాను గతంలో భద్రాచలం వద్ద కూడా క్రస్ట్‌గేట్ మరమ్మత్తును చేపట్టానన్నారు. అక్కడి ప్రభుత్వం తనకు నగదు పరిహారం అందజేసినా కన్నడ ప్రభుత్వం మాత్రం రాజ్యోత్సవ ప్రశస్తిని అందజేసి తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఈ విషయంలో కన్నడ ప్రభుత్వం, ఇక్కడి ప్రజలు చూపిన అభిమానం ఇచ్చిన ప్రోత్సహం చిరకాలం గుర్తుంటుందన్నారు. క్రస్ట్‌గేట్ల నిర్వహణకు సంబంధించి ప్రతి డ్యాం వద్ద నిపుణుల కమిటీ ఉంటుందని వారు ఎప్పటికప్పుడు జాగ్రతలు తీసుకోవాలన్నారు. క్రస్ట్‌గేట్ల లోపంపై ఎవరినీ నిందించలేమన్నారు. విపత్తును ఎదుర్కోవడం ఒక్కటే మార్గమన్నారు. ఈ విషయంలో పరస్పర ఆరోపణలు సరికావన్నారు.

శిథిలావస్థలో పాఠశాల



పెచ్చులూడుతున్న పాఠశాల పైకప్పు

సిరుగుప్ప, అక్టోబరు 3: పట్టణంలో 7,8వ వార్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 50 యేళ్ల కిందట నిర్మించిన ఈ పాఠశాలలో గోడలు, పైకప్పు పెచ్చులూడి తరచూ ఊడిపడుతున్నాయి. తరగతి గదులు పూర్తిగా దెబ్బతిన్నాయి. గోడలు బీటలు వారాయి. వర్షం వచ్చినప్పుడు గదుల్లో నీరు చేరి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఏడో వార్డు పాఠశాల

బుక్కసాగర వద్ద ఎలుగుబంట్ల సందర్శన కేంద్రం

● స్థల పరిశీలనలో అధికారులు



కరడిధామలో సంచరిస్తున్న ఎలుగుబంట్లు

కంప్లి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): దరోజీ కరడిధామ ఎలుగుబంట్ల సందర్శన కేంద్రం తరహాలోనే కరడిధామ వద్ద ఎలుగుబంట్ల వీక్షణ ఏర్పాటుచేయనున్నట్లు హొస్పేట ఎమ్మెల్యే గవియప్ప తెలిపారు. ఆదివారం కమలాపురంలో ఒక కార్యక్రమానికి వచ్చిన ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కమలాపురంలో రూ. 15 కోట్ల వ్యయంతో యాత్రికుల నివాసం నిర్మించేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. ఈ నివాసం ఏర్పడితే పుణ్యక్షేత్రమైన హంపి క్షేత్రంలో వీక్షించేందుకు వచ్చిన పర్యాటకులకు కనీస సుంకంతో అనుకూలంగా ఉంటుందన్నారు. దీంతో పాటు ఇప్పటికే కమలాపురంలో పర్యాటక కేంద్రం, మృగాలయ, జూపార్కు వున్నాయి. ఈ విషయంపై ఇప్పటికే అధికారులు సమావేశం ఏర్పాటు చేశారన్నారు. నెల్లాపురం, దరోజీ వద్ద వుండే కరడిధామ మాదిరిగానే బుక్కసాగర వద్ద కూడా మరొక కరడి సఫారీ ఏర్పాటు చేసి హంపికు వచ్చిన పర్యాటకులకు సంతోషం వ్యక్తం చేస్తారని తెలిపారు. ఇప్పటికే స్థల పరిశీలన జరుగుతుందన్నారు.

గుర్తింపు కార్డుల పంపిణీ



గుర్తింపు కార్డులు అందజేస్తున్న జిల్లా ఫొటోగ్రాఫర్స్ అధ్యక్షుడు నాడేగౌడ

కంప్లి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): తాలుకాలో ఫొటో గ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్‌కు జిల్లా అధ్యక్షుడు నాడేగౌడ, చంద్రమోహన్, ఏపీఏ డైరెక్టర్ వీరేష్ నేతృత్వంలో ఫోటో గ్రాఫర్స్ వీడియో గ్రాఫర్స్‌కు ఆదివారం గుర్తంపు కార్డులు పంపిణీ చేశారు. అనంతరం నాడేగౌడ మాట్లాడుతూ ప్రతి ఒక్క సభ్యులు సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరు సంఘంలో సభ్యులు కావాలి అప్పుడే వారికి గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు జగదీష్, కార్యదర్శి శశిధర్, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, ఫోటో గ్రాఫర్, వీడియో గ్రాఫర్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల కోసమే పథకాలు

● సండూరు కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ




ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ

బళ్లారి సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పేదల కోసమే కాంగ్రెస్ అనేక పథకాలు రూపొందిస్తోందని కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ అన్నారు. ఆదివారం సండూరు ఉప ఎన్నికల ప్రచారంలో ఆమె బొమ్మగట్లు, కళింగేరి, ఎర్రయ్యనహళ్ళి, గొల్ల లింగమనహళ్ళి, సోవేనహళ్లిలో తెల్లవారుజామున రోడ్ షో నిర్వహించారు. బీజేపీవి మాయమాటలేనని, కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. తుంగభద్ర రిజర్వాయర్ నుంచి గ్రామాలకు తాగునీరు తెచ్చే పథకాన్ని ఎన్నికల తర్వాత అమలు చేస్తామన్నారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదించండి.. సాయం చేస్తాం

● వక్ఫ్ బోర్డు నోటీసులపై ఎమ్మెల్సీ సతీష్



బళ్లారి సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు, మఠాలు, సంస్థల ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు వక్ఫ్ బోర్డు, రెవెన్యూ శాఖ నోటీసులు జారీ చేస్తే సంప్రదించాలని విధాన పరిషత్ సభ్యుడు వై.ఎం. సతీష్ పేర్కొన్నారు. తాలూకాలోని మోకా పరిధిలో చెందిన బొమ్మనహాళ్, సింధువాళ, కారేకల్లుతో పాటు జిల్లాలో ఖాళీగా ఉన్న భూమిని స్వాధీనం చేసుకోవాలని వక్ఫ్ బోర్డు నోటీసులు జారీ చేసింది. కొందరు రైతులు బెంగళూరు కన్నింగ్‌హామ్ రోడ్డు వక్ఫ్ బోర్డు కార్యాలయానికి వెళ్లి తమ ఆస్తి యాజమాన్య పత్రాలను సమర్పించారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించి 2023 జూన్ 23న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కర్ణాటక ప్రభుత్వం అమలు చేయాలని, లేదంటే సుప్రీంకోర్టు ఆదేశాలను ప్రభుత్వం ఉల్లంఘించినట్లే అవుతుంది. నోటీసులు అందితే 9535718232 ను సంప్రదించాలని కోరారు.

దైవదర్శనానికి వెళ్తూ పరలోకానికి...

ఆదోని రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): అతివేగం, రాంగ్ రూట్ రెండు ప్రాణాలను బలిగొంది. దైవదర్శనానికి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను రాంగ్‌రూట్‌లో అతివేగంగా వచ్చిన మరో ఆటో ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా ఎనిమిది మంది తీవ్ర గాయాలపాలైన సంఘటన ఆదోని మండలం గణేకల్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. మృతులు కర్ణాటక రాష్ట్రానికి చెందిన రత్నాబాయి(50), ఈసన్న(45)గా గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బళ్లారికి చెందిన వస్త్రాల వ్యాపారి రవిరావు రత్నబాయి కుమార్తె వివాహం డిసెంబరు నాలుగోతేదీన ఖరారైంది. ఆ వివాహానికి సంబంధించి మొదటి పెళ్లి పత్రికను ఉరుకుంద ఈరన్నస్వామికి సమర్పించేందుకు కుమార్తె విద్యశ్రీ, కుమారుడు ఉరుకుంద ఈరన్నరావులతో బయల్దేరారు. ఆదోనికి వచ్చి అక్కడ ఆటోలో ఎక్కారు. చిత్రదుర్గలో ఓవివాహ కార్యక్రమానికి హాజరైన ఈశన్న, తన కోడలు అరుణతో కలసి అదే ఆటోలో ఆదోనిలో ఎక్కారు. వీరితో పాటు మరో నలుగురు కూడా ఉరుకుందకు బయల్దేరారు. డ్రైవర్‌తో సహా 11 మందితో వెళ్తున్న ఆటోను గణేకల్ వద్ద ఎదురుగా రాంగ్ రూట్‌లో వస్తున్న మరో ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఆటోలోని ప్రయాణికులంతా చెల్లాచెదురుగా పడిపోయారు. ఈ ఘటనలో ఈశన్న అక్కడికక్కడే మృతి చెందగా రత్నబాయి ఆదోని ఆసుపత్రికి తరలించిన వెంటనే చనిపోయింది. అదేవిధంగా ఆటోలో ప్రయాణిస్తున్న బళ్లారికి చెందిన సుకుమార్, కుబేర్, రాజశేఖర్, ఉమాదేవి, డ్రైవర్ అయ్యప్ప, ఉరుకుంద ఈరన్నలు తీవ్రంగా గాయపడ్డారు. విద్యశ్రీ, రవిరావు స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా తల్లి రత్నబాయి మృతి చెందడంతో కుమార్తె విద్యశ్రీ, భర్త రవిరావు రోదనలు మిన్నంటాయి.

దీపోత్సవం ప్రారంభం

బళ్లారిరూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వెంకటేశ్వరనగర్‌లో వెలసిన అభయాంజనేయస్వామి ఆలయంలో కార్తీకదీపోత్సవాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. మొదటి కార్తీక దీపోత్సవాన్ని ఆలయ కమిటీ ప్రముఖులు సత్యనారాయణ భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. దీపోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భీమేష్, లోకరాజు, పీఎం నటరాజు, ప్రేమనాథ్, వీరేష్, రాజు, శ్రీరాములు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న దాతలు

బీజింగ్‌లా మారాలి: గాలి

బళ్లారి సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లాను చైనా రాజధాని బీజింగ్‌లా మారాలన్నదే తన కోరిక అని ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సండూరు తాలూకా చోరనూర్‌లో జరిగిన యువజన సదస్సులో ఆయన మాట్లాడారు. సండూర్ హొసపేట మధ్య 50వేల ఎకరాల్లో జిందాల్ లాంటి పది ఫ్యాక్టరీలు రావాలన్నారు. ఖనిజాన్ని స్థానికంగా ఉపయోగించాలనేదే తన కల అన్నారు. జిల్లాలో యువత ఉపాధి పొందాలన్నదే తన ధ్యేయమన్నారు. కాంగ్రెస్ చేసిన ఆరోపణలతో జిల్లాలో మైనింగ్ నిలిచిపో యిందన్నారు. ఈసారి సండూరులో బీజేపీ గెలుపు ఖాయమన్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు



హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

కంప్లి, నవంబరు3(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో వెలసిన దేవలాపురం మారికాంబ దేవికి ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, రాము లోకకళ్యాణార్థం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ తుంగభద్ర డ్యామ్ సమృద్ధిగా నిండి పంటలు పుష్కలంగా పండాలని రైతులు, ప్రజలు సంతోషంగా ఉండాలని పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం, కుంకుమార్చన, లలిత సహస్ర నామ పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రామప్ప, కనికేరి పంపాపతి, విక్కి, వెంకటరమణ బాబు, ప్రభు, బీశన్న, అంజి, చంద్రయ్య దొడ్డ బసప్ప, దొడ్డెప్ప, సురేష్, వీరేంద్రప్రసాద్, క్రిష్ణప్ప, ప్రతాప్, మోటా తిమ్మ, జాకీర్, మంజునాథ్, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

హంపిలో పర్యాటకుల సందడి



ఏకశిలా రథం వద్ద సందర్శకుల సందడి

బళ్లారి సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ నేపథ్యంలో వరుస సెలవులు రావడంతో ఆదివారం హంపిలో పర్యాటకులు సందడి చేశారు. ఉదయం నుంచే స్మారకాల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకుని హంపిలోని అందాలను అస్వాదించారు. పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. దీపావళి సర్వదినం పురస్కరించుకుని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవుల నేపథ్యంలో కుటుంబ సమేతంగా సందర్శకులు హంపి వస్తున్నారు విరుపాక్ష వీధి, మహా నవమి దిబ్బ, పుష్కరిణి, గజశాల, కమల్‌మహల్, విజయవిఠల ఆలయం, ఏకశిల రథం వద్ద సందర్శకుల సందడి ఏర్పడింది.

దరోజీ ఈరమ్మ సమాధిని అభివృద్ధి చేయండి

● రాష్ట్ర బుడగ జంగమ సంఘం అధ్యక్షుడు సన్నమారెప్ప



సన్నమారెప్పను అభినందిస్తున్న సమాజ ప్రముఖులు

కంప్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బుర్రకథ ఈరమ్మ స్మారకం వద్ద అభివృద్ధి చేసి, బుడగ జంగమ సమాజాన్ని గుర్తించాలని రాష్ట్ర బుడగ జంగమ సంక్షేమ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు సన్నమారెప్ప డిమాండ్ చేశారు. ఆదివారం పాత దరోజీలో ఆయన్ని ఘనంగా సన్మానించారు. బెంగళూరులో ఆయన సీఎం, డీసీఎం చేతుల మీదుగా కన్నడ రాజ్యోత్సవం అందుకున్నారు. దీంతో సమాజ సభ్యులు ఆయన్ని ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఇప్పటికీ కళాకారులను ప్రభుత్వం గుర్తించట్లేదన్నారు. కొన్ని సంవత్సరాలుగా గత పాలకులు బుర్రకథ ఈరమ్మ స్మారకాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారే కానీ నిధులివ్వలేదన్నారు. ఎంపీ తుకారామ్ అయినా ఈరమ్మ స్మారక అభివృద్ధికు కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గంగాధర మాట్లాడుతూ.. పగటి వేషధారులు ఇప్పటికీ ఊరూరా తిరుగుతూ వేషధారణలు వేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి పిల్లలకు శిక్షణ కల్పించి వారికి ఒక నిగమ ఏర్పాటు చేసి పగటివేషధారుల కళాకారుల శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రాముడు, తిప్పేస్వామి, మారేష్, జంబన్న, మహాలింగ, ఆదెప్ప, రెడ్డెప్ప, అంజినప్ప, ఆంజినేయ పాల్గొన్నారు.

హోసూరు జోన్

గులాబీ పైరుకు తెగులు



తెగులు సోకిన గులాబీ తోట

హోసూరు నవంబరు3(ఆంధ్రజ్యోతి): గులాబీ తోటలకు తెగులు సోకుతుండంతో రైతులకు ఆవేదన తప్పడం లేదు. హోసూరు సమీపంలోని నల్లూరు పంచాయతీ పరిధి నల్లూరు గ్రామం ఓ రైతు ఎకరం మెరబల్ రోజా సాగు చేస్తున్నాడు. గత నెలలో భారీ వర్షాల కారణంగా మెరబల్ రోజా పంటకు డౌనీ అనే తెగులు సోకింది. ముఖ్యంగా కృష్ణగిరి జిల్లాలోని తళి, అంచెట్టి, రాయకోట, శూలగిరి, బాగలూరు, బేరికై, హోసూరు తదితర ప్రాంతాల్లో అనేక వేల ఎకరాల్లో టమోటా, అనుప, రాగులు, వరి, పుదీనా, కొత్తిమీర, ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్, నోకోల్, కోస్ వంటి కూరగాయలు విస్తారంగా సాగుచేస్తున్నారు. ఇందుల్లో బంతిపూలు, మల్లె, గులాబీ, తదితర పూలను సాగు చేస్తారు. రైతు మునియప్ప, నాగేశ్‌లు మాట్లాడుతూ ఈరకం గులాబీని వారానికోసారి కోస్తున్నామనాని తెలిపారు. నెలకోసారి ఒక ఎకరం పిచికారికి సుమారు రూ.4వేలు ఖర్చువుతుందని తెలిపారు. ప్రస్తుతం తెగులు సోకడంతో పూల దిగుబడి తగ్గిపోయిందన్నారు.

గంజాయి మొక్కల స్వాధీనం



శూలగిరి సమీపంలో స్వాధీనం చేసుకున్న గంజాయి

హోసూరు(క్రైం), నవంబరు3(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతం శూలగిరి సమీపాన గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. డీఎస్పీ ఇన్‌స్పెక్టర్ షర్మిలా భాను ఆధ్వర్యంలో పోలీసులు శూళగిరి ప్రాంతంలో దాడులు నిర్వహించారు. అదే ప్రాంతానికి చెందిన మునియప్పన్ (55) అనే రైతుకూలీ ఏరియప్పలం గ్రామశివారులోని గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు గుర్తించారు. సుమారు 3 అడుగుల ఎత్తు ఉన్న 38 మొక్కలు, 2 అడుగుల పొడవుతో 15 మొక్కలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.20 వేలుగా ఉంటుందన్నారు. గంజాయి మొక్కలను పెంచిన మునియప్పన్ పరారీలో ఉన్నాడని గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

హోసూరు(క్రైం) నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శూలగిరి సమీపంలోని సామలపల్లి గ్రామంల్లో సిద్దప్ప అనే రైతు తోటల్లో ఆవును ఒక చెట్టుకు కట్టివేశాడు. వర్షం కురవడంతో ఆవును మాత్రం అక్కడి వదలి కొంతదూరమున్న ఓ ఇంటివద్దకు చేరుకున్నాడు. ఉరుములతో కూడిన వర్షం కురిసింది. కొద్దిసేపటికి ఉరుములు మెరుపులతో వర్షం జోరందుకుంది. ఒక్కసారిగా పిడుగు ఆవుపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కొద్దిసేపటి తర్వాత ఆవును పరిస్థితిని గుర్తించిన సిద్దప్ప ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు.



ఆవు కళేబరం